ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 2 ఫిబ్రవరి 2024



భీమవరంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

వైసీపీ పాలనతో విధ్వంసం

ప్రజలకు వివరించేందుకు ఈ నెల 9 నుంచి 11 వరకు పల్లెకు పోదాం.. 20 నుంచి పోరుయాత్ర

భీమవరంలో ఎన్నికల శంఖారావం పూరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



భీమవరం టౌన్, ఫిబ్రవరి 1 : 'రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ విధ్వంసకర, ప్రజా కంటక పాలనపై ప్రతి కార్యకర్త గళం విప్పాలి. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు 'పల్లెకు పోదాం' కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్దకు వెళ్లి వాటిని వివరించాలి. 20 నుంచి 29 వరకు పోరుయాత్ర నిర్వహించాలి' అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పిలుపునిచ్చారు. భీమవరంలో నరసాపురం లోక్‌సభ ఎన్నికల కార్యాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వైసీపీ పాలనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని కోరారు. జిల్లా అధ్యక్షునితోపాటు గ్రామంలోని పార్టీ కార్యకర్తలు 24 గంటలు ప్రజలకు అందుబాటులో వుండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు భీమవరం నుంచి ఎన్నికల శంఖారావం పూరించామని తెలిపారు. ఇక్కడి నుంచి రాష్ట్రంలోని 25 పార్లమెంటు నియోజక వర్గాల్లోని కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించామన్నారు. 'నరసాపురం వద్ద నిర్మించే వశిష్ట వారధికి రూ.400 కోట్లను కేంద్రమే కేటాయించింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయహోదా ఇచ్చిన తర్వాత ప్రతీ పైసా కేంద్రమే చెల్లించింది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లపాటు జాప్యం చేస్తే.. వైసీపీ హయాంలో రివర్స్ టెండరింగ్ విధానం వల్ల నిర్మాణం దెబ్బ తింది' అని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ నరసాపురం ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. పురందేశ్వరికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. ఆమెకు క్రేన్ సాయంతో భారీ గజమాలను వేశారు. నర్సయ్య అగ్రహారంలో నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కార్యాలయా న్ని ప్రారంభించారు. ఇక్కడి నుంచి వర్చువల్ విధానం ద్వారా 25 పార్లమెంట్ నియోజకవర్గాల కార్యాలయాలను ప్రారం భించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీ విశ్వనాధరాజు, నారిన తాతాజీ, నిర్మల కిశోర్, పాకా వెంకటసత్యనారాయణ, పేరిచర్ల సుభాష్‌రాజు, షేక్ బాజీ, దంతులూరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

8న షర్మిల జంగారెడ్డిగూడెం రాక

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల ఎనిమిదో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జంగారెడ్డిగూడెం పట్టణంలో రోడ్ షో, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జెట్టి గురున్నాధరావు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలతోపాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.



కాల్వలోకి సభా ప్రాంగణం

అడ్డొస్తే అంతే..!

ఏలూరులో రేపు సీఎం సభ

'సిద్ధం' ఫ్లెక్సీలకు చెట్ల నరికివేత

సభ కోసం కాలువ పూడ్చివేత

■ మెయిన్‌లో..

సీఎం సభ కోసం వాహనాల మళ్లింపు

3వ తేదీ ఉదయం నుంచి రాత్రి వరకు..

ప్రజలు సహకరించాలని ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి విజ్ఞప్తి

■ వివరాలు 7లో..



ఏలూరులో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

160 సీట్లతో టీడీపీ-జనసేన విజయం ఖాయం

చింతలపూడిలో ఈ నెల 5న చంద్రబాబు 'రా కదలిరా' సభకు తరలి రావాలని నేతల పిలుపు

ఏలూరు రూరల్/చింతలపూడి, ఫిబ్రవరి 1 : 'సీఎం జగన్ అరాచకాలు, మోసాలతో ప్రజలు విసుగు చెందారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడటానికి తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుతున్నారు' అని టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. చింతలపూడిలో ఈ నెల 5న జరిగే చంద్రబాబు 'రా.. కదలిరా' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు పర్యటన ఏర్పాట్లపై ఏలూరులోని టీడీపీ జిల్లా కార్యాల యంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓట్ల కోసం కులగణన పేరుతో బీసీలను, డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారని, ఇన్ని రోజులు వీరు గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన రాష్ట్రంలో 150 నుంచి 160 సీట్లు సాధిస్తుందన్నారు. ఏలూరు జిల్లా టీడీపీ కన్వీనర్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన చేత కాని సీఎం జగన్ ఆటవిక పాలన సాగిస్తున్నారని, ఆ పాలనను అంతం చేసి రాష్ట్రం స్వర్ణయుగం సాధించేందుకు ఈ సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సభకు టీడీపీ, జనసేన కార్యకర్తలు, నాయకులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రులు కేఎస్ జవహర్, దేవినేని ఉమ, పీతల సుజాత, మాజీ ఎంపీలు కొనకళ్ల వెంకటనారాయణ, మాగంటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ దిగిపోతేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని అన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళి, ఆరిమిల్లి రాధాకృష్ణ, నియోజవర్గాల ఇన్‌చార్జ్‌లు బడేటి చంటి, బొరగం శ్రీనివాసరావు, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, వలవల బాబ్జీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఆంజనేయులు, జి.శ్రీరామ్మూర్తి, దాసరి శ్యామ్‌సుందర శేషు, కె.నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, జగ్గవరపు ముత్తారెడ్డి, సొంగా రోషన్‌కుమార్, బొమ్మాజి అనిల్, కె.నవీన్‌కుమార్, ఆకుమర్తి రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చింతలపూడిలోని చంద్రబాబు 'రా.. కదలిరా' బహిరంగ సభ ప్రాంగణంలో ఏర్పాట్లను టీడీపీ నాయకులు పరిశీలించారు.



అబ్బే..ఇప్పటికింతే!



మధ్యంతర బడ్జెట్‌లో కురవని వరాలు

- పీఎంఆర్‌వై ఇళ్ల కోటా కాస్త పెంపు
- సోలార్ పాలసీ పేరిట ఉచిత విద్యుత్
- నానో డీఏపీ ఎరువులకు భరోసా
- వేతన జీవులకు నిరాశే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో ఆశించినట్టుగా కాకుండా కేవలం కొన్ని వరాలతోనే సరిపుచ్చేశారు. కీలకమైన పోలవరం ప్రాజెక్టుగాని, ఇతరత్ర ఇరిగేషన్ పథకాలకు ఎలాంటి చేయూత ఇవ్వలేదు. ఆ మేరకు స్పష్టమైన సంకేతాలు ఉండేలా మాట వరుసకైనా ఇవ్వకుండా జాగ్రత్తలు పడ్డారు. పార్లమెంటులో గురువారం కేంద్ర మధ్యంతర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. పూర్తిస్థాయి బడ్జెట్ ఎన్నికల తర్వాతే ఉంటుందనే సంకేతాలు ఇచ్చారు. క్లుప్తంగా బడ్జెట్‌ను ముగించారు. ఈమధ్యంతర బడ్జెట్‌లో కేవలం కొన్నింటికి ప్రాధాన్యత ఇచ్చారు. పీఎం ఆవాస్ యోజన కింద ఏటా కేంద్రం పక్కా గృహాలను మంజూరు చేస్తుంది. ఈ వార్షిక బడ్జెట్‌లో ఈ తరహా గృహాలు రెండుకోట్లు మేర ఉంటాయని భావించింది. ఇంతకు ముందు వార్షిక బడ్జెట్‌లోను ఈ తరహా గృహాల సంఖ్యను ప్రతిపాదించడం, ఆ మేరకు రాష్ట్రాల వారీగా విభజించి కేటాయిస్తుంది. రాష్ట్రానికి వచ్చే వాటాను జిల్లాలవారీగా పంచుతారు. ఆ లెక్కన ఉమ్మడి పశ్చిమలో 15 వేల నుంచి 20 వేల గృహాలు అలవోకగా మంజూరై ఉండేవి. ఈ ఏడాది ప్రకటన ప్రకారం పీఎంఆర్‌వై పథకం కింద కాస్తంత ఎక్కువగానే గృహాల సంఖ్య ఉండవచ్చని జిల్లా అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రత్యేకించి ఎన్నికలకు ముందు వెలువడిన ఈ కేటాయింపు కొందరిలో ఆశలు రేపింది. సోలార్ పథకం కింద 300 యూనిట్లలోపు విద్యుత్‌ను అందించేందుకు కేంద్రం కొత్త పథకాన్ని ఈ బడ్జెట్‌లోనే ప్రవేశపెట్టింది. ఈ కారణంగా సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్ వ్యయంలో ఏడాదికి 15 నుంచి 20 వేల రూపాయలు కలిసి వస్తుందన్నట్టుగా బడ్జెట్‌లో వివరించే ప్రయత్నం చేశారు. ఆయుష్మాన్ భవ స్కీం ఆశా, అంగన్‌వాడీ లకు కూడా వర్తిస్తున్నట్టు మరో కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ లకు ఇచ్చే ప్రత్యేక సదుపాయా లను రాష్ట్ర ప్రభుత్వం ఇంతకుముందే ఉపసంహరిం చుకుంది. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ వరం కాస్తా ఆశ, అంగన్‌వాడీ కుటుంబాల్లో ఆశలు రేపింది. ఇంకోవైపు ఏటా మాదిరిగానే ఈసారి కూడా మధ్యంతర బడ్జెట్‌లో పోలవరం ప్రాజెక్టు ఊసేలేదు. రైల్వేకు సంబంధించి ఇలాంటి ప్రయ త్నమే చేశారు. పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు మాత్రమే ఈ తరహా కీలక అంశాలపై పద్దు తేలనుందని అంచనా వేస్తున్నారు. ప్రత్యేకించి వేతన జీవులు, ఇతర వర్గాలు ఆశించినట్టుగా ఆదాయ పరిమితి విషయంలో కేవలం ప్రతిపాదన మాత్రమే చేశారు. అసలు గుట్టు మాత్రం విప్పలేదు.





పన్ను రేట్లలో మార్పు లేకపోవడం నిరాశే



ఆదాయ పన్ను పరిధి, పన్ను రేట్లలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ఉద్యోగులకు, పెన్షన్ దారులకు నిరాశ కలిగించింది. ఐదు ఆక్వా పార్కుల ఏర్పాటు గోదావరి జిల్లాలకు ఎంతో ఉపయోగకరం. న్యూరూఫ్ టాప్ సోలార్ పవర్ పథకంలో 300 యూనిట్ల కరెంటు ఉపయోగంతో పాటు సోలార్ ప్లాంట్ పెట్టుకోవడానికి రాయితీ ఇవ్వడం వల్ల ప్రతి గృహస్తుడు కొంత సొమ్ము పొదుపు చేసుకోవచ్చు. 2014-23 కాలానికి ఎఫ్‌డీఐ ద్వారా 596 బిలియన్ యుఎస్ డాలర్లు ఇండియాలో పెట్టుబడి పెట్టినట్టు తెలిపినా, పెట్టుబడులు ఉపయోగించుకున్న తర్వాత నికర పెట్టుబడులు విలువను తెలపలేదు. పీఎం ఆవాస్ యోజనలో రెండు లక్షల కోట్ల గృహాలను బడుగు, మధ్యతరగతి వర్గాలకు అందజేయడం హర్షనీయం. వికసిత్ భారత్ ద్వారా రూ.75 వేల కోట్లు రాష్ట్ర ప్రభుత్వాలకు అందించడం రాష్ట్రాల అభివృద్ధికి తోడ్పడుతుంది.

- చెరుకూరి శ్రీనివాసరావు, బ్రహ్మయ్య అండ్ కో చార్టర్డ్ అక్కౌంటెంట్

వేతన జీవులకు ప్రయోజనం శూన్యం

పేదలు, మహిళలు, యువత, వ్యవసాయదారులను నాలుగు పాదాలుగా అభివర్ణిస్తూ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ వేతన జీవులను పూర్తిగా విస్మరించింది. నాలుగేళ్లగా ఎటువంటి మార్పులు లేని ఆదాయపు పన్ను శ్లాబ్‌లను యధావిధిగా కొనసాగించడం అమానుషం. రూ.25 వేలు స్టాండర్డ్ డిడక్షన్ పెంచడం వల్ల గరిష్టంగా రూ.7,500 టాక్స్ మినహాయింపు తప్ప ఏ విధమైన ప్రయోజనం వేతన జీవులకు కలగలేదు. ఉద్యోగులందరూ నూతన పన్ను విధానం ఎన్నుకునే విధంగా ప్రభుత్వ విధానాలు ప్రేరేపిస్తున్నాయి.

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శామ్యూల్, ప్రధాన కార్యదర్శి కె.ఆర్.పవన్‌కుమార్

రైతాంగాన్ని నిరాశపరిచిన బడ్జెట్



కేంద్ర ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టిన కేంద్ర ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ రైతాంగాన్ని నిరాశపరిచింది. రైతులకు మాటలు చెప్పి కార్పొరేట్‌లకు రాయితీలు ఇచ్చారు. మద్దతు ధరల చట్టం తీసుకు రావాలని రైతులు కోరుతున్నా కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదన లేకపోవడం అన్యాయం. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోదీ పంటల ఖర్చులు, రైతుల ఆత్మహత్యలు రెట్టింపు చేశారు.

- కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

తణుకు/ చింతలపూడి/ఏలూరు రూరల్

ఆగని ఆశీలు దందా..

- 'ఆంధ్రజ్యోతి' కథనంపై పట్టణంలో తీవ్ర చర్చ..
- అయినా మౌనవ్రతంలో అధికారులు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : 'అడ్డగోలుగా ఆశీలు దందా' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో గురువారం ప్రచురితమైన కథనం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశమైంది. రోడ్‌సైడ్ వ్యాపారులు, ఆశీలు దందా బాధితులు ఇకనైనా ఈ దందా సర్దుమనుగుతుందని భావించారు. కానీ గురువారం కూడా ఈ దందా యథావిధిగా కొనసాగింది. అధికారులు మాకేమీ తెలియదనట్టు మౌనవ్రతం పట్టారు. అనధికారికంగా రశీదులు ఇవ్వని, అధికంగా వసూలు చేసిన సొమ్ములు ఎటు పోతున్నాయనేది ప్రశ్నగా మారింది. అక్రమ వసూళ్ల దందాలో అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధుల పాత్ర ఉన్నట్టు విమర్శలు గుప్పుమంటున్నాయి. ఏటా మునిసిపల్‌కు సంబంధించి నిర్వహించే ఆశీలు వేలం పాటలో అక్కడకు వచ్చిన వారంతా సిండికేట్ అవ్వడం పాటకు స్వచ్ఛందంగా వచ్చిన వారికి ఎంతో కొంత ముట్టజెప్పి పంపడం జరుగుతోందన్న విమర్శలున్నాయి. ఏడాదికి ఒకరు వేలం పాట దక్కించుకున్నట్టు పైకి కన్పిస్తున్నా కొన్నేళ్లుగా కొంతమంది కనుసన్నల్లోనే వసూలు దందా నడుస్తోంది. వేలం పాట ఎవరి సొంతమైనా వసూలు చేసే వ్యక్తులు మారడం లేదు. బెదిరించడం, భయపెట్టడం, అడ్డగించడం చేయడంలో ఆరితేరిన వారే ప్రస్తుతం ఆశీలు వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 1: ఎన్నికల నిర్వహణలో ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అతి ముఖ్యమైనదని డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల విధానం, ఎంసీసీ విధులపై జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్ పథక సంచాలకులు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. మోడల్‌కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు తహసీల్దార్ బి. సోమశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేయించి ఇస్తామన్న ప్రభుత్వ ప్రకటనలు ప్రస్తుతం పేపర్లకే పరిమితమయ్యేలా ఉన్నా యి. వలంటీర్ల హడావుడే తప్ప ఇంత వరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. గైడ్‌లైన్స్ అందక అధికారులు కంగారు పడుతుంటే, రిజిస్ట్రేషన్లు జరిగినా విక్రయాలకు హక్కు లేదంటున్న ప్రభుత్వపు వింత వైఖరికి లబ్ధిదారులు నిట్టూర్పు విడుస్తున్నారు. వంద శాతం ఎన్నికల స్టంట్‌గా ఈ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఎవరి ఉప యోగాల కోసమంటూ ప్రజా వ్యతిరేకత పెరుగుతోంది.



ఎన్నికల స్టంట్!

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల పేరిట హడావుడి

- రుణాలకు మాత్రమే పనికొచ్చేలా ప్రక్రియ
- రిజిస్ట్రేషన్ అయినా అమ్మకానికి ఐదేళ్లు
- నిబంధనలపై నేటికీ స్పష్టత కరువు
- వెబ్‌సైట్ నిర్వహణలో సాంకేతిక లోపాలు
- రెండు వారాల్లో రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని అధికారుల మెడపై కత్తి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి):

2019కి ముందు నవరత్నాల పేరిట జగన్ ప్రకటించిన పథకాల్లో ఇళ్ల స్థలాల పంపిణీ ఒకటి. ఐదేళ్ల క్రితం ప్రకటించిన ఆ హామీ మూడేళ్ల క్రితం ప్రారంభించిన సీఎం దాదాపు ఏడాదిన్నర క్రితానికి గానీ ఒక దశకు చేరుకోలేదు. ఊరికి చివరగా విసిరేసినట్లున్న ఆయా కాలనీల్లో నివాసం ఉండేందుకు ఆరంభం నుంచి లబ్ధిదారులు అనాసక్తిగా ఉండేవారు. కాంట్రాక్టర్లు సైతం నిర్మాణాలు చేపట్టడానికి వెనకాడారు. ఈ క్రమంలో పలు కార్పొరేషన్లు, మునిసిపాలిటీల కమిషనర్లు చేతికి దొరికిన తాపీమేస్త్రీలను బతిమాలుకున్నారంటే అతిశయోక్తి కాదు. ఆ పరిస్థితుల నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న అధికారులపై ఈ ప్రభుత్వం మరో పిడుగు వేసింది. ఫిబ్రవరి రెండో వారంలోగా స్థలాల రిజిస్ట్రేషన్ చేయాలని హెచ్చరికలు జారీ చేసింది. రిజిస్ట్రేషన్ల తర్వాత ఎలాంటి షరతులు వర్తిస్తాయి? స్థలా యజమానులు స్థలాలను విక్రయించుకోవచ్చా? లేదా కేవలం రుణాల మంజూరుతో తృప్తి పడాల్సిందేనా? వంటి ఏ గైడ్‌లైన్స్‌ను ప్రభుత్వం అందించలేదు. సాధారణంగా ప్రభుత్వం ఇచ్చే ఇళ్లు లేదా ఇళ్ల స్థలాలను లబ్ధిదారులు తమ సమస్యల కొద్దీ విక్రయించుకునే వీలులేకుండా ఐదు లేదా పదేళ్ల కాల పరిమితిని విధించే షరతులు ఆది నుంచి అమలులో ఉండగా, జగనన్న కాలనీల విషయంలోనూ ప్రస్తుతం అవే నిబంధనలు వర్తిస్తున్నాయి. ఎన్నికలకు అతి కొద్ది నెలల గడువు ఉన్న తరుణంలో ప్రభుత్వం నిర్ణయించిన రిజిస్ట్రేషన్ల ప్రకటనతో లబ్ధిదారులు తమ స్థలాలను అవసరాల రీత్యా క్రయ విక్రయాలు చేసుకోవచ్చని ఆశించారు. అధికార వర్గీయుల సమాచారం ప్రకారం ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రత్యేక సవరణ ఆదేశాలు అందలేదు. ఒకవేళ అలాంటి అవకాశం కల్పించాలనుకుంటే ఈపాటికే ప్రభుత్వ ప్రత్యేక ఆదేశాలను జీవో రూపేణా విడుదల చేయాల్సింది. అలా జరగని క్రమంలో పాత షరతుల ప్రకారమే క్రయ, విక్రయ హక్కులు లేని రిజిస్ట్రేషన్లు జరిగే అవకాశముందని స్పష్టమవుతోంది.

కాలనీల్లో నివాసాల నిర్మాణాల నిమిత్తం ప్రభుత్వం పలువురు కాంట్రాక్టర్లను నియమించింది. ఆ కాంట్రాక్టర్లు వారికి నచ్చిన వ్యక్తులు, నాయకులను సబ్ కాంట్రాక్టర్లుగా చేర్చుకుని ప్రారంభ దశ నుంచీ నిర్మాణాలు చేపట్టింది. ఇప్పటికీ పెండింగ్ బిల్లులు చాలానే ఉన్నాయి. ఈ క్రమంలో కొందరు కాంట్రాక్టర్లు తాము నిర్మిస్తున్న ఇళ్లను తమ పేరిట లేదా తాము ప్రతిపాదించిన వ్యక్తుల పేరిట విక్రయించే షరతుల కొద్దీ అగ్రిమెంట్లు చేసుకుని లబ్ధిదారులకు బయానాలు అందించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, కైకలూరు తదితర నియోజకవర్గాల్లో చాలా చోట్ల ఈ తరహా ఒప్పందాలతో అగ్రిమెంట్లు జరిగాయి. ఒప్పంద ధరలో కొంత సొమ్మును స్థల యజమానులకు అందించిన కాంట్రాక్టర్లు ఆయా స్థలాలను నేటికీ వారి గుప్పెట్లలోనే పెట్టుకున్నారు. వాస్తవానికి మంజూరైన పుస్తకాలు ఎవరి పేరిట ఉంటే వారికే రిజిస్ట్రేషన్లు జరగాలి. కానీ, చాలా చోట్ల అనధికారికంగా జరిగిన విక్రయాల కారణంగా ఆ పుస్తకాలు లబ్ధిదారులు చూపించలేకపోతున్నారు. మరోవైపు జిల్లాలో 80 వేలకు పైగా వున్న లబ్ధిదారుల నుంచి సేకరించిన డాక్యుమెంట్లను వెబ్‌సైట్లో అధికారులు నమోదు చేయాలి. ఆ నమోదు ఆధారంగానే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఓ వైపు ఫిబ్రవరి 9 లేదా 12వ తేదీ కల్లా రిజిస్ట్రేషన్లు పూర్తి కావాలని ప్రభుత్వం ఆదేశిస్తుండగా, వెబ్‌సైట్లు మొరాయించడం అధికారులకు పెను భారంగా మారుతోంది. ఒకవేళ ఫిబ్రవరి రెండో వారంలోపే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిందంటే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అటకెక్కినట్లే. పరిస్థితి చూస్తే లబ్ధిదారులకు ఉపయోగపడాల్సిన రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఒక ఎన్నికల స్టంట్‌గా ప్రజలు భావిస్తున్నారు.

ముగ్గురు డీఎస్పీల బదిలీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : జిల్లాలో నూజివీడు, జంగారెడ్డిగూడెం, పోలవరం, ఇంటెలిజెన్స్ డీఎస్పీలను బదిలీ చేశారు. నూతనంగా డీఎస్పీలను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా 104 మంది డీఎస్పీలను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీ చేశారు. నూజివీడు డీఎస్పీ ఇ.అశోక్‌కుమార్ గౌడ్‌ను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ -2 డీఎస్పీగా నియమించగా ఆయన స్థానంలో మెరైన్ డీఎస్పీ అటాచ్డ్ టు విశాఖపట్నం కమిషనరేట్ ఆఫ్ పోలీస్‌లో ఉన్న డీఎస్పీ ఎం.శ్రీనివాసరావును నూజివీడు డీఎస్పీగా నియమించారు. పోలవరం డీఎస్పీ జి.రత్నరాజును ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ సౌత్ ఏసీపీగా నియమించగా పశ్చిమ గోదావరి జిల్లా సీసీఎస్ డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావును పోలవరం డీఎస్పీగా నియమించారు. జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడును ఈవోడబ్ల్యు-2 డీఎస్పీగా నియమించగా పల్నాడు జిల్లా దిశ డీఎస్పీ యు.రవిచంద్రను జంగారెడ్డిగూడెం డీఎస్పీగా నియమించారు. 14వ బెటాలియన్ డీఎస్పీ అటాచ్డ్‌టు ఎస్సీ ఎస్టీ సెల్ నంద్యాల డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్.రామాంజి నాయక్‌ను ఏపీఎస్పీ మూడో బెటాలియన్ డీఎస్పీగా నియమించి ఏలూరు ఎస్సీ ఎస్టీ సెల్ అటాచ్డ్ డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. నందిగామ డీఎస్పీ అటాచ్డ్‌టు పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడును ఏలూరు జిల్లా ఎస్ఈబీ డీఎస్పీగా నియమించారు. జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వరరావును తుళ్ళూరు డీఎస్పీగా నియమించారు.

విడదీయలేని అనుబంధం

గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు యాభై ఏళ్లు



నరసాపురం, ఫిబ్రవరి 1: జిల్లా మీదుగా ఎన్నో ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తుంటాయి. వాటిలో కొన్ని రైళ్లలో ప్రయాణించేదుకు చాలామంది ఇష్టపడుతుంటారు. అటువంటి వాటిలో గోదావరి ఎక్స్‌ప్రెస్ ఒకటి. సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడిచే ఈ ఎక్స్‌ప్రెస్‌తో జిల్లా ప్రయాణికులకు ఎంతో విడదీయరాని అనుభందం ఉంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఈఎక్స్‌ప్రెస్‌కు గురువారంతో 50 ఏళ్ళు పూర్తయ్యాయి. ఈ ఐదు దశాబ్దాల కాలంలో ఈ ఎక్స్‌ప్రెస్ లక్షలాది మంది జిల్లా వాసులను సురక్షితంగా గమ్య స్థానాలకు క్షేమంగా చేర్చింది. దక్షిణమధ్య రైల్వే పరిధిలో నడిచే ఈ ఎక్స్‌ప్రెస్ 1974 ఫిబ్రవరి 1న పట్టాలెక్కింది. 7007 నంబర్‌తో సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచేది. 2011 వరకూ ఈ రైలు ఎక్స్‌ప్రెస్‌గానే నడుస్తుండటంతో జిల్లాలో ఏలూరు, భీమడోలు, నిడదవోలు, కొవ్వూరు స్టేషన్‌లలో ఆగేది. అయితే దీనిని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌గా చేసి నంబర్ 12727గా మార్చారు. దీంతో ప్రస్తుతం జిల్లాలో ఏలూరు,తాడేపల్లిగూడెం స్టేషన్‌లలో మాత్రమే ఆగుతోంది. దక్షిణ మధ్య రైల్వేలో మొట్టమొదటి ఏసీ ఫస్ట్‌క్లాస్ బోగీలతో నడిచే ఎక్స్‌ప్రెస్ ఇదే కావడం గమనార్హం. అటు సికింద్రాబాద్, ఇటు విశాఖపట్నం వెళ్ళేవారు ముందుగా ఈ రైలులో వెళ్లేందుకు మక్కువ చూపుతారు.షెడ్యూల్ సమయాలకు అనుగుణంగా ఈరైలు నడవటమే దీనికి కారణం. జిల్లా వాసులతో ఎంతో అనుబంధం పెనవేసుకున్న ఈ రైలుకు నేటికి 50 ఏళ్లు నిండటంతో చాలా మంది ప్రయాణికులు తమ అనుభూతులను గుర్తు చేసుకుంటున్నారు.

సీఎం పర్యటన..వాహనాల మళ్లింపు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : ఏలూరులో 3న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ దృష్ట్యా ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా మీదుగా వెళ్లే భారీ వాహనాలను దారి మళ్ళిస్తున్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు తెలిపారు.

విశాఖపట్టణం వైపు నుంచి విజయ వాడ, చెన్నై వైపు వెళ్ళే భారీ వాహనాలను కత్తిపూడి జంక్షన్ వద్ద మళ్లించి గొల్లప్రోలు, కాకినాడ, అమలాపురం, చించినాడ బ్రిడ్జి, నర్సాపురం, మొగల్తూరు మీదుగా మళ్లించారు. పెరవలి, సిద్దాంతం వద్ద దారి మళ్ళించిన వాహనాలు పెనుగొండ, పాలకొల్లు, నర్సాపురం, మొగల్తూరు మీదుగా తాడేపల్లిగూడెం, తణుకు వద్ద దారి మళ్ళించిన వాహనాలు భీమవరం, నర్సాపురం, మొగల్తూరు, లోసరి వంతెన మీదుగా చెన్నై వైపు వెళ్ళాలన్నారు.

విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు దేవరపల్లి వద్ద దారి మళ్లించనున్నట్టు తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం సూర్యాపేట మీదుగా వెళ్లాలన్నారు. తాడేపల్లిగూడెం వద్ద దారి మళ్ళించిన వాహనాలను నల్లజర్ల, కొయ్యలగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా, నారాయణపురం వద్ద దారి మళ్లించిన వాహనాలు దూబచర్ల, భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మీదుగా వెళతాయన్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు, రామన్నపేట అడ్డరోడ్డు, ధర్మాజీగూడెం, చింతలపూడి, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా వెళ్ళాలన్నారు.

విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్ళే చిన్న వాహనాలు సోమవరప్పాడు (జంగారెడ్డిగూడెం రోడ్డువైపు నుంచి) జోగన్నపాలెం, సీతమంపేట రైల్వే గేటు, తిరుమల డైరీ మీదుగా జాతీయ రహదారిలోకి వెళ్ళాలన్నారు. రాజ మండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్ళు కార్లు, ఇతర చిన్న వాహనాలు కొవ్వలి బ్రిడ్జి నుంచి కొవ్వలి, పాలగూడెం మీదుగా మినీ బైపాస్ రోడ్డు, వట్లూరు, కలపర్రు వద్ద జాతీయ రహదారిలోకి వెళ్లాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఏలూరు జాతీయ రహదారిపై, ఆశ్రం ఆసుపత్రి వైపు కాని వాహనాలు రాకూడదని సూచించారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.


బహుమతి అందజేస్తున్న ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

సౌతిండియా సైన్స్ ఫెయిర్‌లో చింతలపూడి విద్యార్థినులకు ప్రథమ బహుమతి

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 : దక్షిణ భారత సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాకు ప్రథమస్థానం లభించింది. 8 రాష్ట్రాల్లో ఇటీవల వేర్వేరుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్లలో ఆయా విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచిన బాలబాలికలతో జనవరి 27 నుంచి గురువారం వరకు విజయవాడలోని మురళీ కన్వెన్షన్ సెంటర్‌లో సదరన్ ఇండియా సైన్స్‌ఫెయిర్- 2024 నిర్వహించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ), బెంగళూరు విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నలాజికల్ మ్యూజియం ఆధ్వర్యంలో దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌లో చింతలపూడి జడ్పీ హైస్కూలు విద్యార్థినులు కె.సౌమ్య, ఎం.శ్రీవర్షిణిల ప్రదర్శన జాతీయస్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకుందని డీఈవో పి.శ్యాంసుందర్ వెల్లడించారు. ఆటో మేటిక్ ఇంటర్ లాకింగ్ సిస్టం, కవచ్ సాంకేతికతను ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో ప్రదర్శించారు. విజేతలకు గురువారం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎస్సీఈఆర్టీ రాష్ట్ర డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి, బెంగళూరు సైన్స్ మ్యూజియం సీనియర్ సైంటిస్టు జ్యోతి నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారని చింతలపూడి జడ్పీ హైస్కూలు హెచ్ఎం మురళీకృష్ణ తెలిపారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ చౌదరి, గైడ్‌టీచర్ కె.రవికుమార్‌లు అభినందించారు.

విద్యార్థులు సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసే స్థాయికి వెళ్ళాలి


ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న కృష్ణసౌజన్య

తాడేపల్లిగూడెం అర్బన్, ఫిబ్రవరి 1: విద్యార్థులు సొంతంగా కంపెనీలు ఏర్పాటు చేసే స్థాయికి ఎదగాలని బిజినెస్ కన్సల్టింగ్ అండ్ ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ఎస్.కృష్ణ సౌజన్య అన్నారు. ఏపీ నిట్‌లో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ స్కిల్స్ ఆటిట్యూడ్,బిహేవియర్ డవలప్‌మెంట్ అనే అంశంపై విద్యార్థులకు ఆన్లైన్‌లో అవగాహన నిర్వహించారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే ప్రతీ అంశంపై అవగాహన పెంచుకోవడంతో పాటు, సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలన్నారు. నిట్ డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి మాట్లాడుతూ సాంకేతికతను జోడిస్తే ఎన్నో అద్భుతాలను సృష్టించవచ్చునన్నారు. ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ అధ్యక్షురాలు డాక్టర్ సుదర్శన దీప, ఉపాధ్యక్షులు డాక్టర్ శంకర్,ఆచార్యులు డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.


ఏలూరులో చికిత్స పొందుతున్న మధుబాబును పరామర్శిస్తున్న నేతలు

వైసీపీ దురాగతాలకు ప్రతిఫలం అందుకుంటారు

పెదవేగి, ఫిబ్రవరి 1 : వైసీపీ అరాచకాలు, దురాగతాలకు ప్రతిఫలాన్ని అందుకునే సమయం దగ్గర పడిందని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణ అన్నారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలో పోలవరం కుడి ప్రధాన కాలువ గట్టునుంచి మంగళవారం రాత్రి మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తున్న సమయంలో అడ్డుకున్న టీడీపీ నాయకులపై వైసీపీ మూకలు దాడిచేసిన ఘటనలో గాయపడ్డ పెదవేగికి చెందిన టీడీపీ నాయకుడు తాతా సత్యనారాయణ, ఏలూరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జోగన్నపాలెం సొసైటీ మాజీ చైర్మన్ పసుమర్తి మధుబాబులను గన్ని వీరాంజనేయులు, చింతమనేని ప్రభాకర్, ఘంటా మురళీరామకృష్ణతో పాటు పలువురు టీడీపీ నాయకులు పరామర్శించారు. వైసీపీ చిల్లర రాజకీయాలు చేస్తోందన్నారు. దాడులు, దౌర్జన్యాలతో భయపెట్టాలని చూస్తోందన్నారు. తాము వైసీపీలాగా పిల్ల చేష్టలకు పోమని సక్రమ మార్గంలోనే వారికి బుద్ధి వచ్చేలా చేస్తామని సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.


కొల్లేరులో సేద తీరుతున్న విదేశీ వలస పక్షులు

ప్రమాదంలో చిత్తడి నేలలు

సంరక్షించుకోకపోతే పర్యావరణానికి ముప్పు

ఆటపాకలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏటా వేడుకలు

నేడు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

కైకలూరు, ఫిబ్రవరి 1: పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు చిత్తడి నేలలు ఉండవు. ఇప్పటికే పలురకాల పక్షులు, జంతువులు, జీవ జాతులు అంతరించిపోతున్నాయి. కొన్నిరకాల జంతువులు, పక్షులు చూడాలంటే జూపార్కులోనో, ఛానల్స్‌లోనే చూడవలసి వస్తుందని, ఇదే పరిస్థితి కొన సాగితే భవిష్యత్తులో చిత్తడినేలలు కనుమరుగవుతాయని పర్యావరణ నిపు ణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవాళి మనుగడకు చిత్తడి నేలలు ఎంతో దోహదపడతాయి. సృష్టిలో సహజసిద్ధంగా ఏర్పడిన వనరులను కాపాడుకుంటే భావితరాల ప్రజలకు వాటి ఆవశ్యకత, స్వచ్ఛ మైన పర్యావరణాన్ని అందించగలుగుతాం. సృష్టిలో ఉన్న అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడి నేలల్లోనే ఉంటాయి. పక్షులకు ఈ నెలల్లో ఆహారం సంవృద్ధిగా లభిస్తుంది. వీటి ప్రాముఖ్యతను గుర్తించి వివిధ దేశాలు చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తున్నాయి.

చిత్తడి నేలల పరిధిలోకి కొల్లేరు

చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించి ఇరాన్ దేశంలోని రామ్‌సార్ గ్రామంలో 1971లో జరిగిన సదస్సులో ప్రపంచంలోని అన్ని దేశాలు పాల్గొన్నాయి. ఈ సదస్సులో చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా వాటిని పరిరక్షించాలని ఆయా దేశాల ప్రతినిధులు తెలి యజేశారు. అదే రోజును పురస్కరించుకొని ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంగా గుర్తించి రామ్‌సర్ సైట్ అని నామకరణం చేశారు. ప్రపంచంలో పలు దేశాల్లోని చిత్తడినేలలుగా పేరొందిన వాటిని ఈ సైట్‌లోకి తీసుకున్నారు. చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా దేశాలకు వివరించారు. కొల్లేరు 2002లో రామ్‌సర్ సైట్‌లోకి తీసుకున్నారు. 2006లో కొల్లేరును అటవీశాఖ అధికారులకు అప్పగించారు. 2009 నుంచి ఆటపాక వలస పక్షుల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహి స్తున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వారికి కొల్లేరు, చిత్తడి నేలల ఆవశ్యకతపై పలు పోటీలను నిర్వహిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందిస్తారు.



ప్రాధాన్యంపై ప్రచారం శూన్యం

ప్రతీ సంవత్సరం అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల్లో ఈ నేలల విశిష్టతను తెలిపేవిధంగా ఎక్కడా కొల్లేరు పరివాహక ప్రాంతంలో ఏ విధమైన ప్రచారాలు లేవు. గతంలో డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈ కార్యక్రమాలు డబ్ల్యుడబ్ల్యుఎఫ్ బృందం పాల్గొనడం మానేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అటవీశాఖ అధి కారులు కొల్లేరు కాలువలో తాటిదోనెల పోటీలను రెండు సంవత్సరాల పాటు నిర్వహించారు. పక్షుల పండుగను జరిపి ప్రజలను తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు.ఈ నేలల అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు చేసిందీ లేదు. చిత్తడినేలల విశిష్టతను అందరికీ తెలిసేవిధంగా మరింత ప్రచారం చేస్తే వాటి విలువ తెలుస్తుందని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు.


కొల్లేరు వ్యూ

సముద్రం, నది ఇతర నీటి వనరులు కలిగిన తీరప్రాంతాల్లో తక్కువ లోతు ఉండి ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. పెద్దనదులు లేదా సరస్సుల వెంబడి మంచినీటి చిత్తడి నేలలు ఏర్పడతాయి.. అతిపెద్ద సరస్సుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సును చిత్తడి నేలలు కలిగిన భూమిగా గుర్తించారు.

అభయారణ్యం వైపుగా పులి

పాపికొండల ప్రాంతానికి తిరుగు ప్రయాణం

ఏజెన్సీ వాసులు అప్రమత్తంగా ఉండాలి

టాంటాం ద్వారా అటవీ అధికారుల హెచ్చరిక

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 1 : వారం పది రోజులు మన్యంతో పాటు జిల్లా వాసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన పెద్దపులి అభ యారణ్యానికి తిరుగు ప్రయాణం పట్టినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. పులి కాలిముద్రలు, ఇనుప కంచెలను దాటుతుండగా కంచెకు ఇరుక్కుపోయిన పులి వెంట్రుకలను సేకరించారు. ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లా గోపాలపురం మండలం మాతంగమ్మమెట్ట పరిసర ప్రాంతాల్లో పులి ఉందని రాత్రికి ఏజెన్సీకి చేరవచ్చని అటవీశాఖ అధికారులు తెలియజేశారు. ముందు జాగ్రత్త చర్యగా మన్యం ప్రాంతంలోని ప్రజలను అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రబాబు, కన్నాపురం రేంజర్ కృష్ణకుమారి ఆదేశాల మేరకు బుట్టాయగూడెం, పోల వరం మండలాల్లోని అటవీ ప్రాంతానికి దగ్గరలో ఉన్న గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టాం టాం వేయించినట్లు ఎఫ్ఎస్‌వో మూర్తి, వైల్డ్‌లైఫ్ డీఆర్‌వో జె.ప్రభాకర్ తెలిపారు. మండలంలోని రాజానగరం, కొవ్వాడ, రెడ్డిగూడెం, లక్ష్మీపురం, నాగన్నగూడెం, కొత్తరాజానగరం, కామయ్య కుంట, లంకపల్లి గ్రామాలతో పాటు పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డీ పేట ఇతర గ్రామాల్లో టాంటాం వేయించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పశువులను, మేకలను పొలాల్లో కట్టవద్దని, ప్రజలు కూడా ఒంటరిగా సంచరించవద్దని తెలిపారు.ఇప్పటికే పులి జాడను కనుగోనేందుకు మండలంలోని ముంజులూరు పంచాయతీ పరిధిలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అభయారణ్యం నుంచి ముందుగా అటవీ ప్రాంతంలోకి ప్రవేశించిన పులి బుట్టాయగూడెం మండలంలోని ముంజు లూరు, రెడ్డికోపల్లె ప్రాంతాల్లో ఆవును, మేకను చంపి తినేసింది. తర్వాత కొయ్యలగూడెం, గోపాలపురం, నల్లజర్ల, పెదవేగి, ద్వారాకతిరుమల మండలాల్లో సంచరించి ఆవుదూడను చంపివేసింది. అభయారణ్యం వైపు వెళుతోందనే విషయం తెలియగానే ప్రజలతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

మాతంగమ్మ మెట్ట వద్దకు..

గోపాలపురం : నిన్న మొన్నటి వరకు ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల్లోని అడవుల్లో సంచరించిన పెద్దపులి గురువారం ఉద యానికి దేవరపల్లి మండలం యాదవోలు, చిన్నాయిగూడెం గ్రామాల మధ్య సంచరించినట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో యాదవోలు రెవెన్యూ పరిధి దాటి వాదాలకుంట గ్రామ శివారులో ఉన్న గాడిచెరువు సమీపంలోని గద్దే ఈశ్వరుడుకు చెందిన పొగాకు తోటలో పెద్దపులి జాడలు కనపడటంతో రైతులు భయంతో ఇళ్లకు చేరుకున్నారు. ఈ విషయాన్ని అటవీ శాఖాధికారులకు తెలపడంతో పులి అడుగుజాడలు వెంబడిస్తూ సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మ మెట్ట వెనుకభాగంలో పెద్దపులి ఉన్నట్లు అటవీ శాఖాధికారులు గుర్తించారు. కరిచర్లగూడెం, కోమటిగుంట, వాదాలకుంట, వెదుళ్ళకుంట, జగన్నాధపురం, కరగపాడు, బుచ్చయ్యపాలెం గ్రామాల్లో సాయంత్రం 5 గంటలు దాటితే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దంటూ టాంటాం వేయించారు. తూర్పుగోదావరి జిల్లా ఫారెస్ట్‌రేంజ్ అధికారి ధర్మరాజు ఇచ్చిన వివరాల ప్రకారం పది రోజులుగా సంచరిస్తున్న పెద్దపులిని వెంబడిస్తున్నామని గురువారం సాయంత్రానికి కరిచర్లగూడెం, కోమటిగుంట గ్రామాల మధ్యలో ఉన్న మాతంగమ్మమెట్ట వద్దకు పెద్దపులి చేరినట్లు గుర్తించామన్నారు. తమ అంచనా ప్రకారం కరగపాడు మీదుగా పోలవరం పాపికొండల ప్రాంతానికి వెళ్లవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు.


పులి పాదముద్రలు, వెంట్రుకలను సేకరించిన అటవీశాఖ అధికారులు

యాదవోలులో కలకలం

దేవరపల్లి : దేవరపల్లి మండలం యాదవోలులో పెద్దపులి అడుగు జాడలు కనిపించడంతో గ్రామస్థులు, రైతుల్లో భయం, ఆందోళన మొదలయ్యాయి. గురువారం యాదవోలులో పొగాకు తోటల్లో పులి అడుగులు కనిపించాయని ఈ అడుగులు గోపాలపురం మండలం మాతంగమ్మమెట్ట, జగన్నాధపురం వైపు వెళ్లినట్లు రైతులు చెబుతున్నారు.

తాడిపూడి ఇసుక ర్యాంపులో చిరుతపులి



తాళ్ళపూడి : తాళ్ళపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంప్‌లో గురువారం చిరుతపులి సంచరిస్తున్నట్లు పలువురు గుర్తించారు. గోదావరి తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్లడాన్ని అక్కడ పనిచేసే సిబ్బంది చూసి భయ భ్రాంతులకు గురై పక్కనే ఉన్న షెడ్డులో దాక్కున్నారని తెలిపారు. దూరం నుంచే నడుచు కుంటూ వెళ్లిన దృశ్యాన్ని వీడియోలో బంధించారు. చిరుత పులి తాళ్ళపూడి గ్రామం వైపుగా వెళ్లిందని చెప్పడంతో గోదావరి తీర ప్రాంత వాసులు కాస్త జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వాహనం ఢీకొని తాపీమేస్త్రి మృతి

న్యాయం చేయాలని బంధువుల ధర్నా




తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 1: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన చినతాడేపల్లి రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కడియద్దకు చెందిన తాపీపని చేసే నరెడ్ల చంద్రశేఖర్ (35) గురువారం తాడేపల్లిగూడెంలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా చినతాడేపల్లి రోడ్డు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో చంద్రశేఖర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కడియద్దకు చెందిన బంధువులు మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగారు. సీసీ కెమేరాల ద్వారా ఢీకొన్న వాహనాన్ని గుర్తించి న్యాయం చేస్తామని ఎస్ఐ సురేష్ హామీ ఇవ్వడంతో బంధువులు ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. జనవరి 31వ తేదీన మండలంలోని తాడువాయి సెంటర్‌లో అప్పలరాజుగూడెంకు చెందిన గన్నిన వీరవెంకట కృష్ణారావు (65) రోడ్డుపై గాయాలతో పడి ఉండటాన్ని అటుగా వెళుతున్న నారి నాగరాజు అనే వ్యక్తి గుర్తించి కృష్ణారావు కుమారుడు గన్నిన సురేంద్రప్రసాద్‌కు తెలిపాడు. తన తండ్రిని ఆసుపత్రికి తీసుకువెళ్లమని చెప్పగా నాగరాజు వెంటనే కృష్ణారావును జంగారెడ్డిగూడెం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించాడు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడి తన తండ్రి మృతి చెందినట్లు సురేంద్ర ప్రసాద్ తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మంగయ్య తెలిపారు.

పలివెలలో రోడ్డు ప్రమాదం...ఇద్దరి మృతి

ఆచంట, ఫిబ్రవరి 1: కొత్తపేట మండలం పలివెల గ్రామం చౌదరి పురం సత్తెమ్మ తల్లి గుడి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి చెందారు. స్థానికుల కథనం ప్రకారం ఆచంటకు చెందిన ఆటోడ్రైవర్ బండి మోషె, రావులపాలెం మండలం ముమ్మిడివరప్పాడుకు చెందిన చీమల మాధవరావు మోటారు సైకిల్‌పై వస్తుండగా ఎదురెదురుగా వస్తున్న ఆటో ఢీకొనడటంతో ఇరువురు మృతి చెందారు. మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. చీమల నరసింహరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మోటారు సైకిల్‌పై నుంచి పడి ఒకరి మృతి

భీమడోలు, ఫిబ్రవరి 1 : మోటారు సైకిల్ అదుపు తప్పి వ్యక్తి మృతి చెందినట్టు భీమడోలు ఎస్ఐ సుధాకర్ తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ద్వారకా తిరుమల మండలం తిరుమలంపాలెం గ్రామానికి చెందిన పంతగాని రాయప్ప (40) పల్సర్ మోటారు సైకిల్‌పై దెందులూరు మండలం గండేవారిగూడెం గ్రామంలో ఉన్న తన భార్యను తీసుకురావడానికి వెళ్తుండగా పోలసానపల్లి డంపింగ్ యార్డు సమీపంలో అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు.

ఏటీఎం కార్డు మోసం .. రూ.70 వేలు విత్‌డ్రా

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : ఏటీఎం కార్డును మార్చి ఒక మహిళను మోసం చేసిన సంఘటనపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఏఎస్ఐ మంగయ్య తెలిపిన వివరాలు ప్రకారం జంగారెడ్డిగూడెం యూనియన్ బ్యాంకులో మైసన్నగూడానికి చెందిన పుట్టా సునీతకు ఉన్న అకౌంట్ నుంచి 25వ తేదీన ఏటీఎం ద్వారా నగదు తీసుకునేందుకు వెళ్లగా, చదువు రాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి సహాయం అడిగింది. సహాయం చేసినట్లుగా నటించిన ఆ వ్యక్తి ఆమె ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడన్నారు. అనంతరం అదే రోజు రాత్రి 7 గంటల నుంచి 26వ తేదీ ఉదయం 3 గంటల మధ్య రూ.70 వేలు విత్‌డ్రా చేశాడన్నారు. మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సునీత భర్త సుధాకర్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మంగయ్య తెలిపారు.

భర్త అదృశ్యం.. భార్య ఫిర్యాదు

ఆకివీడు, ఫిబ్రవరి 1: తన భర్త కనబడడం లేదంటూ భార్య ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆకివీడు కోనూరివీధికి చెందిన టైలర్ షేక్ బాబ్జి (46) బుధవారం నుంచి కనబడక పోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో గాలించారు. కనిపించక పోవడంతో గురువారం పోలీస్ స్టేషన్‌లో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేర ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మోటారు సైకిళ్ళు ఢీ.. ఒకరికి గాయాలు

ఆకివీడు, ఫిబ్రవరి 1: చినకాపవరంలో ఎదురెదురుగా మోటారు సైకిళ్ల ఢీకొనడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. గురువారం పెదకాపవరం నుంచి చినకాపవరం వెళ్ళుతున్న కుప్పల మావుళ్ళను పెదకాపవరం వైపు వెళుతున్న వ్యక్తి వేగంగా ఢీకొని వెళ్ళిపోయాడు. మావుళ్ల కాళ్ళు, చేతులకు గాయాలయ్యాయి. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

ఇంకా తప్పుల తడకలే..

చింతలపూడి, ఫిబ్రవరి 1 : ఓటర్ల జాబితా కోసం ప్రత్యేక క్యాంపులు పెట్టినా తప్పుల తడక మాత్రం మారలేదు. మరణించినవారు, డబుల్ ఎంట్రీలతో తికమక పడుతున్నారు. ఓటర్ల జాబితాలు తిరగేస్తే మరణించిన వారిపేర్లు తొలగించలేదు. డబుల్ ఎంట్రీలు మార్పు చేయలేదు. చింతలపూడి నగర పంచాయతీలోని పాతచింతలపూడిలోని 14వ వార్డులో 614 ఓటరు గట్టు చినగోపయ్య, 1173 ఓటరు పోతిరెడ్డిపల్లి లింగమ్మ, 53వ నెంబరు ఓటరు చలమాల ప్రవీణ్‌లు చనిపోయినా ఓట్లు తొలగించలేదు. ఇదే వార్డులో డబుల్ ఎంట్రీలు ఉన్నాయి. 484, 158 ఓటర్లలో తలారి ఝాన్సీ పేరు రెండు సార్లు నమోదైంది. సత్తెనపల్లి నాగ ప్రసన్నకుమార్ అనే ఓటరు 147, 148లో డబుల్ ఎంట్రీగా నమోదై ఉన్నాయి.

20 నుంచి లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాలు



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 1: సుందర గిరిపై స్వయం వ్యక్తునిగా కొలువైన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 20 నుంచి 25 వరకూ కల్యాణ మహోత్సవాలు జరుగనున్నాయని ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమై మండలంలోని ఐఎస్ జగన్నాధపురంలో కొలువైన స్వామివారి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20న ఉదయం 10 గంటలకు స్వామివారిని, అమ్మవార్లను పెండ్లికుమారుడు, పెండ్లి కుమా ర్తెలుగా చేస్తారు. సాయంత్రం ధ్వజారోహణ జరుగుతుందన్నారు. 21న నిత్య హోమాలు, మూల మంత్ర హవనాలు, 22న ఉదయం 11-10 గంటలకు స్వామివారి కల్యాణం జరుగుతుందన్నారు. 23న నిత్యహోమాలు, మూల మంత్ర హవనాలు, గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 24న శ్రీచందనోత్సవం, ధ్వజఅవరోహణ, 25 శ్రీపుష్ప యాగంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.

నష్టం వస్తోంది .. నా వల్ల కాదు

దేవస్థానం టోల్‌గేట్ నిర్వహణ వదిలేసిన కాంట్రాక్టర్


సిబ్బంది లేకపోవడంతో కొండపైకి వెళ్తున్న వాహనాలు

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 1: మరో ఏడాది కాలం గడువు ఉండగానే టోల్‌గేట్ నిర్వహణ సంబంధిత కాంట్రాక్టర్ వదిలేశారు. మొదటి ఏడాది నష్టం వచ్చిందని చెబుతూ దానిని అర్ధంతరంగా తప్పుకున్నారు. రెండేళ్ల కాలానికి గాను జరిగిన వేలంపాటలో ఏడాది క్రితం శ్రీనివాసరావు అనే కాంట్రాక్టర్ టోల్ వసూలు చేసుకునే హక్కును ఏడాదికి రూ.1.70 కోట్లకు కైవసం చేసుకున్నాడు. నిబంధనల ప్రకారం రెండో ఏడాది 10 శాతం మేర పెంచి మొదటి ఏడాది పూర్తి కావడానికి మూడు నెలల ముందే ఆ మొత్తాన్ని దేవస్థానానికి చెల్లించాల్సి ఉంది. ఒకే విడతగా చెల్లించాల్సి ఉండగా మొదటి ఏడాది మొత్తాన్ని నాలుగు విడతలుగా చెల్లించినట్లు చెబుతున్నారు. జనవరి 31న మొదటి ఏడాది పూర్తవగానే జీఎస్టీ కారణంగా నష్టపోతున్నానని ఇకపై నిర్వహణ సాధ్యం కాదని, తనిచ్చిన డిపాజిట్ సొమ్ము రూ.10 లక్షలు చెల్లించాలని దేవస్థానానికి అర్జీ పెట్టుకుని గురువారం నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. దీంతో దేవస్థానం సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈవో వేంద్ర త్రినాథరావు మాట్లాడుతూ కాంట్రాక్టర్‌పై టెండర్ షరతుల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రెండో ఏడాది అద్దె మొత్తం మొదటి ఏడాది ముగిసేందుకు మూడు నెలల ముందే వసూలు చేయాల్సి ఉందన్నారు. ఎందుకు వసూలు చేయలేదో విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు చేపడతామన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్లు పరిశీలించిన రిజిస్ట్రార్



ఆచంట,ఫిబ్రవరి 1: ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు రిజిస్ట్రేషన్ నిమిత్తం ఇటీవల సచివాలయంలో రిజిస్ట్రేషన్‌లు చేసేందుకు జీవో జారీ చేయడంతో ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా రిజిస్ట్రార్ ఆర్.సత్యనారాయణ శుక్రవారం ఆచంట సచివాలయంలో రిజిస్ట్రేషన్ విధానాన్ని పరిశీలించారు. తొందరగా జిల్లాలోని అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. ఆచంట సబ్ రిజిస్ట్రార్ ఎస్.కమల కుమారి, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, వీఆర్‌వో సీతారామ్ పాల్గొన్నారు.


విజిలెన్సు అధికారులు సీజ్ చేసిన వేప, ఆముదం పిండి

ఐదు లక్షల విలువైన వేప, ఆముదం పిండి సీజ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇతర రాష్ట్రాల నుంచి ఆముదపు పిండి దిగుమతి చేసి విక్రయిస్తున్న ఒక వ్యక్తిపై విజిలెన్సు అధికారులు కేసు నమోదు చేశారు. జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ విల్సన్, ఏవో సురేష్ కుమార్, అగ్రికల్చరల్ అధికారి పవన్, రెవెన్యూ అధికారులు గురువారం కామవరపుకోట గ్రామంలోని కర్షక్ ఆగ్రో ఇండస్ట్రీస్‌పై దాడి చేశారు. అక్కడ 50 వేల 441 మెట్రిక్ టన్నుల వేప పిండి, ఆముదం పిండి ఉండడాన్ని గుర్తించారు. ఎటు వంటి లైసెన్సులు లేకుండా అక్రమంగా తయారు చేసి నిల్వ చేసి అమ్ముతున్నట్లుగా గుర్తించారు. ఇండస్ట్రీస్ యజమాని ఉదయ్ కుమార్‌ను అధికారులు ప్రశ్నించగా పొగాకు సూర, వేప గింజలతో వేప పిండి తయారు చేసి గుజరాత్ రాష్ట్రం కేదార్ జిల్లా నుంచి ఆముదపు పిండి తీసుకువచ్చి రైతులకు అమ్ముతున్నట్లుగా వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా విక్రయించడంతో అతనిపై బయో ఫెర్టిలైజర్ అండ్ ఆర్గానిక్ ఫెర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ 1985 (8)(19) నిబంధనల మేరకు కేసు నమోదు చేశారు. అక్కడ ఉన్న వేప, ఆముదపు పిండి విలువ ఐదు లక్షల 83 వేల 100 రూపాయలు ఉంటుందని గుర్తించి వాటిని సీజ్ చేశారు.

రైల్వే గేటు ట్రాక్‌పై దిగబడిన ట్రాక్టర్

ఉంగుటూరు, ఫిబ్రవరి 1 : మండల కేంద్రమైన ఉంగుటూరు రైల్వే గేటు మధ్యలో తాటి పట్టెలతో వెళుతున్న ట్రాక్టర్ గురువారం రాత్రి దిగబడి పోయింది. ఈ విషయమై స్థానికులు అప్రమత్తమై ట్రాక్టర్‌ను ట్రాక్ నుంచి తప్పించారు. దీంతో ఇదే సమయంలో కాకినాడ నుంచి తిరుమల వెళుతున్న రైలును పదిహేను నిమిషాల సేపు ఆపాల్సి వచ్చింది.

రాష్ట్రంలో ప్రజాకంటక పాలన : పురందేశ్వరి


కార్యాలయ ప్రారంభ కార్యక్రమంలో నేతలు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 1: రాష్ట్రంలో ప్రజాకంటక పాలన సాగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికల కేంద్రాలను వర్చువల్‌గా గురువారం ఆమె ప్రారంభించారు. అశోక్‌నగర్‌లోని జిల్లాపార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, జిల్లా ఇన్‌చార్జ్ ఏపీఆర్ చౌదరి, నరేంద్ర తదితరులు హాజరయ్యారు. పురందేశ్వరి మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలు గుండెచప్పుడు అన్నారు. మోదీ పాలనలో ప్రతిరోజూ కొత్త పథకాలు ప్రవేశపెడుతున్నారని మహిళలకు పార్లమెంట్‌లో 30శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. ఏపార్టీలోనూ కార్యకర్తలకు గౌరవం ఉండదని బీజేపీలో మాత్రమే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షప్రసారం ద్వారా నాయకులు, కార్యకర్తలు తిలకించారు.

ఎన్నికల హామీలు అమలు చేయడంలో మోదీ విఫలం


సమావేశంలో మాట్లాడుతున్న రాజు

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1: ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘోరంగా విఫలమయ్యారని ఏఐటీయూసీ ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు విమర్శించారు. మక్కినవారిగూడెంలో ముఠా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. టీవీఎస్ రాజు మాట్లాడుతూ ఎన్నో పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న 44 చట్టాలకు మోదీ తూట్లు పొడుస్తున్నారన్నారు. కార్మికులంతా ఏకమై మోదీ కుయుక్తులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అసంఘటిత కార్మికులకు ఉపాధి గ్యారెంటీ చూపించాలని, హమాలీ కార్మికులు ధాన్యం, మొక్కజొన్న తదితర ఆహార ధాన్యాల ఎగుమతి దిగుమతి సమయంలో ప్రమాదం ఏర్పడితే కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. అసంఘటిత కార్మికులందరికీ ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షులు కొండముచ్చు శ్రీనివాసరావు, ఇస్సారపు రాము, బయ్యగాని ఏకాంబరం, పాలకొల్లు గంగాధరరావు, మునునూరు కృష్ణారావు, కాళహస్తి సుబ్బారావు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ గెల టన్నుకు రూ.18వేలు ధర ప్రకటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 1: కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఆయిల్ పామ్ గెల టన్నుకు రూ. 18 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్నే భవనంలో గురువారం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది టన్ను రూ.23వేలు ధర వస్తే ప్రస్తుతం రూ.12,400కు పడిపోయిందన్నారు. ఉత్పత్తి ఖర్చులు, కౌలు రైతులతో నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం ఎత్తివేసిన ఫలితంగా ఆయిల్‌పామ్ రైతులు నష్టపోవాల్సి వస్తోందన్నారు. తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. బొద్దు రాంబాబు, ఆయిల్‌పామ్ రైతుసంఘం నేత సిద్ధిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

4న ఆర్యవైశ్య సంఘం అర్బన్ జిల్లా కమిటీ ప్రమాణస్వీకారం


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న అంబికా రాజా

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 1: అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార సభ సీఆర్ రెడ్డి కళాశాల ఆడిటోరియంలో ఈ నెల 4న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు దివ్వెల జయప్రకాష్ తెలిపారు. అంబికా భవన్‌లో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబికా రాజా గురువారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. రాజా మాట్లాడుతూ సమాజసేవలో ఆర్యవైశ్యులు ఎప్పుడు ముందుంటారన్నారు. గౌరవ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాస్, మద్దుల రవికుమార్, వేమా సురేష్, బచ్చు విష్ణు, కూరపాటి సత్యనారాయణ, బొద్దు శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, వి.సత్యనారాయణ, డి.బ్రహ్మయ్య, కూరాళ్ళ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నృత్య, చిత్రకళ పోటీల్లో అప్పనవీడు విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులు

పెదపాడు, ఫిబ్రవరి 1: రాష్ట్ర స్థాయి చిత్రకళ, నృత్య పోటీల్లో అప్పనవీడు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కోనసీమ జిల్లాలో మదర్ థెరిస్సా ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో జనవరి 31న నిర్వహించిన పోటీల్లో 10 మంది చిత్రకళలో బంగారు పతకాలు, నృత్యంలో ఏడుగురు బంగారు పతకాలను సాధించినట్లుగా హెచ్.ఎం. పుష్పావతి తెలిపారు. వారిని ఎంఈవోలు నరసింహమూర్తి, వెంకటరమణ, ఉపాధ్యాయులు, పేరెంట్ కమిటీ సభ్యులు అభినందించారు.

పాఠశాలలను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయాలి

పెదపాడు, ఫిబ్రవరి 1: రాబోయే ఎన్నికలకు సంబంధించి ప్రతి పాఠశాలను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయాలని పోలింగ్ జరిగే పాఠశాలల హెచ్‌ఎంలను ఎంపీడీవో తేజరతన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో హెచ్‌ఎంల సమావేశం గురువారం జరిగింది. ఎంఈవో నరసింహమూర్తి మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాల సాధనకు కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. ఎంఈవో-2 వెంకటరమణ మాట్లాడుతూ నాడు-నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో పనులను పూర్తి చేయాలని, మధ్యాహ్న భోజన నిర్వహణ సమర్థవంతంగా జరగాలన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్పనవీడులో ఎరువుల దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారులు

పెదపాడు, ఫిబ్రవరి 1: ఎరువులు, పురుగుమందుల దుకాణదారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని వ్యవసాయశాఖ (మండవల్లి) ఏడీఏ జి.వెంకటమణి తెలిపారు. అప్పనవీడులోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు, రికార్డులు, తూకం, ఎరువులను పరిశీలించారు. తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి ప్రదీప్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి


రక్తమార్పిడి పరిశీలిస్తున్న డాక్టర్ ప్రసాదరావు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ భవనంలో గురువారం రక్తమార్పిడి నిర్వహించారు. డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె వర ప్రసాదరావు ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాధితులకు ప్రతి నెలా రక్తమార్పిడి చేయాల్సి ఉంటుందని రక్తదాతలు ముందుకు వచ్చి వారిని ఆదుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ రిటైర్డ్ ఏఈ గుణ్ణం రామారావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి సీతారాం, కడియాల కృష్ణారావు, రామారావు, రత్నాకర్, పీఆర్వో దేవీరమణ పాల్గొన్నారు.

మద్యం మత్తుకు రూ.10 వేలు జరిమానా

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 1 : మద్యం మత్తులో వాహనాలు నడిపితే భారీ మూల్యం చెల్లించాల్సిందే. పట్టణంలో ఎస్‌ఐ జ్యోతిబసు గురువారం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి ఆరుగురిని మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించారు. వారిని స్థానిక కోర్టులో హాజరుపరచగా న్యాయాధికారి ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించారు. ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలు అతివేగంగా నడుపుతున్నారన్న సమాచారంతో ఎస్‌ఐ డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు.


కలెక్టరేట్ వద్ద మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా


యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రిలే దీక్ష


బుట్టాయగూడెంలో వినతిపత్రం ఇస్తున్న భోజన కార్మికులు


ఐటీడీఏ వద్ద మాతృభాషా వలంటీర్ల నిరసన

సమస్యలపై పోరు

యూటీఎఫ్ దీక్షలు.. మున్సిపల్ టీచర్ల ధర్నా

భోజన కార్మికులు, భాషా వలంటీర్ల నిరసన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 1: యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రెండో రోజు నిరాహార దీక్షలు కొనసాగించారు. కలెక్టరేట్ వద్ద దీక్షా శిబిరాన్ని జిల్లా అధ్యక్షుడు ముస్తఫా ఆలీ ప్రారంభించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల విషయం, ఆర్థిక బకాయిల చెల్లింపులపై మంత్రివర్గ సమావేశంలో ఒక్క ప్రకటన కూడా లేకపోవడం దారుణమన్నారు. 30వేలకు పైగా ఉపాధ్యాయుల పోస్టులు డీఎస్సీ ద్వారా నియమించాల్సి ఉండగా, కేవలం రూ.6,100 పోస్టులతో డీఎస్సీ ప్రకటించటం హాస్యాస్పదం అన్నారు. ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో బి.సుభాషిణి, ఎన్. రాంబాబు, జి.దేవానందరావు, బి.మోహన్‌రావు, కె.శ్రీనివాసరావు, రామ అంజిబాబు, రమణ, మోహన్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ టీచర్స్ ఫెడరేషన్స్ పక్షాన జిల్లాశాఖ అధ్యక్షుడు టి.రామారావు అధ్యక్షతన గురువారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాల్మన్‌రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసి దాదాపు ఏడాది కావస్తున్నా నేటికి సర్వీస్ రూల్స్ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. తక్షణం మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షుడు టి. రామారావు మాట్లాడుతూ మున్సిపల్ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు కల్పించాలని మున్సిపాల్టీ పరిధిలోని ఎంఈవో, డీవైఈవో పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2024 నియామకం పొందే వారికి రెగ్యులర్ పేస్కేల్ అందించాలని, కొత్త పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీఆర్వో వెంకటేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. యూవీ. నరసింహరాజు, బి.సోమేశ్వరశాస్త్రి, ఎస్.దొరబాబు, కేఎన్.రమాదేవి, ఏలూరు, కొయ్యలగూడెం, లింగపాలెం, నిడమర్రు అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

బుట్టాయగూడెం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎంఈవో టి.బాబురావుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భోజన పథకాన్ని నీరుకారుస్తున్నాయన్నారు. 23 ఏళ్లగా భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులతో ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయిస్తుందని, తాము అధికారంలోకి వస్తే భోజన పథకం కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీ నేటికి అమలు చేయలేదన్నారు. ప్రతి నెల 5న వేతన బిల్లులు ఇవ్వాలని, మెను చార్జీలు రూ.20 పెంచాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంటలు చేసేటపుడు ప్రమాదానికి గురైతే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. బక్కా మహాలక్ష్మి, పూనెం వెంకటలక్ష్మి, గంగాదేవి, సత్యవతి, పోచమ్మ, రామలక్ష్మి, పెంటమ్మ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషా వలంటీర్లకు పీడీఎస్‌వో మద్దతు

బుట్టాయగూడెం మండలం కేఆర్.పురం ఐటీడీఏ కార్యాలయం వద్ద మాతృభాషా వలంటీర్ల పోరాటానికి పీడీఎస్‌వో జిల్లా కమిటీ మద్దతు తెలిపింది. జిల్లా నాయకుడు ఎస్.మోహన్ మాట్లాడుతూ వలంటీర్ల సమస్యలను ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన గౌరవ వేతనం ఇవ్వాలని, పేస్కేలు అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి అర్హత సర్టిఫికెట్లను మంజూరు చేయాలని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాష్, శ్రీను, వెంకటేశ్ వలంటీర్లు పాల్గొన్నారు.


సమస్యలు తెలుసుకుంటున్న బడేటి చంటి


టీడీపీలో చేరిన వారితో చింతమనేని అభివాదం


బాధితుడిని పరామర్శిస్తున్న అశోక్ గౌడ్


సాయం అందజేస్తున్న నారా లోకేశ్ సేవా సమితి ప్రతినిధులు

జగన్ పాలనలో

వ్యవస్థలు అస్తవ్యస్తం

టీడీపీ నేతల ధ్వజం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 1: జగన్ రెడ్డి పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగిపోయారని, అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్ చరిత్రహీనుడిగా మిగిలిపోతారని టీడీపీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బడేటి చంటి మండిపడ్డారు. ఏలూరు 16వ డివిజన్ వంగాయగూడెం అంబేడ్కర్ విగ్రహం నుంచి గురువారం నిర్వహించిన ప్రజాసంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ప్రతిచోటా ఎస్సీలు, బీసీలు, ఎస్టీలు అంటూ ప్రేమ ఒలకబోసే జగన్మోహన్‌రెడ్డి ఎస్సీల సంక్షేమానికి ఏం చేశారో చెప్పాలని చంటి డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో అవినీతి, అక్రమాల గురించి టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్ళి ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి ఘన విజయం సాధించడం తథ్యమన్నారు. చోడే వెంకటరత్నం, శ్రీకాకుళం రమేష్, ఆలూరి రవి, కలపాల కుమార్, ఆలూరి కిషోర్, తలపంటి రాంబాబు, సకల బత్తుల దివాకర్, కాటూరి శ్రీను, చల్లా రాఘవ, కొత్తపల్లి రాజు, శ్రీకాకుళం రాజు, శ్రీకాకుళం నాగరాజు, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

పెదవేగి: అరాచక పార్టీ అంతం ప్రారంభమైందని, త్వరలోనే ఖాళీ అవుతుందని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదకడిమిలో 25 కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులు పులుసూరి వెంకట కుటుంబరావు, చల్లగొళ్ళ శివగోపాలకృష్ణ, ఉండవల్లి నాగేశ్వరరావు, మునునూరి దశరథరామయ్య కొసరాజు జగన్మోహనరావు, విక్రమ్, హరీష్, కోటేశ్వరరావు, సత్యనారాయణ, సుమంత్, విజయకుమార్ తదితరులు చింతమనేని సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వైసీపీ అంతానికి సమయం దగ్గర పడిందన్నారు. ప్రశ్నించినవారిపై దాడులు, బాధితులపైనే కేసులు.. ఇదీ వైసీపీ నడుపుతున్న రాజ్యాంగమని, దీనికి త్వరలోనే ప్రజలే ముగింపు పలుకుతారని ఆయన పేర్కొన్నారు. వైసీపీ దురాగతాలు తెలుసుకున్న వైసీపీ నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడి బయటకు వస్తున్నారని, దీనికి ఉదాహరణ పెదకడిమిలో వైసీపీకి చెందిన 25 కుటుంబాల నాయకులు ఒకేసారి టీడీపీలో చేరడమేనన్నారు. అక్రమాలకు పాల్పడిన ఏ నాయకుడికి మినహాయింపు ఉండబోదని, ఆర్థిక నేరాలకు పాల్పడిన ప్రతి ఒక్కరూ బోనెక్కాల్సిందేనని ప్రభాకర్ స్పష్టం చేశారు. సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి, చల్లగొళ్ళ గోపాలకృష్ణ, బొప్పన సుధాకర్ పాల్గొన్నారు.

వైసీపీది పిరికిపంద చర్య

వైసీపీది పిరికిబంద చర్య అని టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ చలమోలు అశోక్‌గౌడ్ అన్నారు. మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ నాయకులపై జరిగిన దాడి సంఘటనలో గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తాతా సత్యనారాయణను అశోక్‌గౌడ్, న్యాయవాది ఈదుర్గంటి శ్రీనివాసబాబులు గురువారం పరామర్శించారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ప్రతిపక్షాలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయన్నారు. సీఎం జగన్ భారత రాజ్యాంగాన్ని పక్కన పెట్టి, రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నాడని ఆరోపించారు. వైసీపీ చేస్తున్న దురాగతాలకు మూల్యం చెల్లించుకునే సమయం దగ్గర పడిందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటుతో నీట్‌గా జగన్‌కు బుద్ధి చెప్తారన్నారు.

5న రా.. కదలి రా సభ విజయవంతం చేద్దాం

దెందులూరు: చింతలపూడిలో ఈ నెల 5న జరిగే రా.. కదలిరా సభను విజయవంతం చేసేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకరావు అన్నారు. సోమవరప్పాడులో నాలుగు మండలా పార్టీ అధ్యక్షులు, సమన్వయ కమిటీ సభ్యులు ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సభ విజయవంతం చేసేందుకు తీసుకోవల్సిన చర్యలపై సూచనలు చేశారు. మాగంటి సురేంద్రనాథ్ చౌదరి, చెన్ను గాంధీ, మద్దిపాటి వెంకటరాజు, మాగంటి నారాయణప్రసాద్, మోతుకూరి నాని, యిప్పిలి వెంకటేశ్వరావు, పెనుబోయిన మహేష్‌యాదవ్, నాగనబోయిన సత్యనారాయణ, బోడేటి మోహన్‌బాబు, ఏనుగు రామకృష్ణ, నున్న లక్షణ్ బాబు. గారపాటి కొండయ్యచౌదరి, కసుకుర్తి రామకృష్ణ, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా లోకేశ్ సేవా సమితి చేయూత

జంగారెడ్డిగూడెం: నారా లోకేశ్ సేవా సమితి ద్వారా నిరుపేద, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూతనందిస్తున్న ఆకుమర్తి రామారావు సేవలు అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ అన్నారు. చక్రదేవరపల్లిలో క్యాన్సర్‌తో బాధిత కుటుంబాలకు ఆకుమర్తి రామారావు ఆర్థిక సాయంతో పాటు బియ్యం, దుప్పట్లు గురువారం పంపిణీ చేశారు. సాయిల సత్యనారాయణ మాట్లాడుతూ చక్రదేవరపల్లి గ్రామానికి చెందిన 5 కుటుంబాలకు రూ.30వేలు నగదు, 125 కేజీల బియ్యం, దుప్పట్లు రామారావు అందజేశారన్నారు. వైట్ల ఆంజనేయులు, కొఠారు ప్రసాద్, బలుసు కిరణ్ కుమార్, తాడెల్లి గురుమూర్తి, మానికాల మంగరాజు, మానుకొండ సుశీల, కరిపోతు ప్రభాకర్, ఉమ్మడి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ సూపరింటెండెంట్‌గా రామకృష్ణ



ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : ఎస్ఈబీ జిల్లా సూపరింటెండెంట్‌గా కె.రామకృష్ణ గురువారం బాధ్యతలు ఏలూరులో స్వీకరించారు. అనకాపల్లి అసిస్టెంట్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు జిల్లాకు పోస్టింగ్ ఇచ్చారు. సారా నిర్మూలన, అక్రమ మద్యం, గంజాయి రవాణా నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. చెక్‌పోస్టులను ఏర్పాటు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు. అక్రమ రవాణాపై సమాచారం ఉంటే 9440902434కు తెలియజేయాలని ఆయన సూచించారు.

ఏలూరు ట్రాఫిక్, సైబర్ క్రైం సీఐల నియామకం

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏలూరు రేంజ్‌లో పలువురు సీఐలను బదిలీ చేశారు. ఏలూరు జిల్లాలోని ఏలూరు సోషల్ మీడియా, సైబర్ క్రైమ్ సెల్ ఇన్‌స్పెక్టర్ కాగిత శ్రీనివాసరావును ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. వీఆర్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్ బిహెచ్ వెంకటేశ్వర్లును ఏలూరు సోషల్ మీడియా, సైబర్ క్రైం డీఎస్పీగా నియమించారు.

సమగ్రశిక్ష ఏపీసీగా సోమశేఖర్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 1 : సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ)గా బి.సోమశేఖర్ నియమితులయ్యారు. ఏలూరు తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఆయనకు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఎన్నికల బదిలీల్లో భాగంగా సోమశేఖర్‌ను ఎస్ఎస్ఏ ఏపీసీగా ప్రభుత్వం బదిలీచేసింది. ఎస్పీడీ కార్యాలయంనుంచి నియామకపత్రాలు అందిన తర్వాత జిల్లాలో కలెక్టర్‌ను కలుసుకుని శుక్రవారం ఏపీసీ బాధ్యతలు చేపడతానని సోమశేఖర్ వివరించారు. ఇప్పటివరకు బాధ్యతలను ఇన్‌చార్జి హోదాలో డీఈవో శ్యాంసుందర్ నిర్వర్తిస్తున్నారు.

బీజేపీ తరపున జబర్దస్త్ బృందం రోడ్ షోలు

పోలవరం, ఫిబ్రవరి 1 : మండలంలో బీజేపీ పార్లమెంటరీ నాయకులు గారపాటి సీతారామంజనేయ చౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం పలు చోట్ల జబర్దస్త్ కమెడియన్‌ల బృందం రోడ్ షోలు నిర్వహించనున్నట్లు కామిశెట్టి నాగరాజు తెలిపారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట, పట్టిసీమ ఫెర్రీ, గూటాల, పోలవరంలో జబర్దస్త్ కమెడియన్‌ల రోడ్ షోలు ఉంటాయన్నారు.

స్నేహాంజలి క్రికెట్ లీగ్ బ్రోచర్ ఆవిష్కరణ

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 1: ఫ్యూచర్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్నేహాంజలి క్రికెట్‌లీగ్ సీజన్-2 పోటీలు నిర్వహిస్తున్నట్లు హుస్సేన్ తెలిపారు. బ్రోచర్‌ను డీఎస్పీ శ్రీనివాసులు గురువారం ఆవిష్కరించారు. త్వరలో తేదీలను ప్రకటించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జిల్లాలో పింఛన్ల పంపిణీ ప్రారంభం

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 1: జిల్లాలో పింఛన్లు పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా 2,72,841 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.81.59 కోట్లు విడుదల చేసింది. గ్రామ, వార్డు వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి వలంటీర్లు పింఛన్‌లు పంపిణీ చేస్తున్నారని గురువారం రాత్రి 7గంటల వరకు 2,16,458 మంది లబ్ధిదారులకు రూ. 64.60 కోట్లు (79.26శాతం) పంపిణీ చేసినట్లు తెలిపారు.

బియ్యం కార్డుదారులకు నిత్యావసర సరుకులు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 1: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం కార్డుదారులకు సరఫరా చేసే నిత్యావసర సరుకులు పంపిణీ గురువారం ఉదయం నుంచి ప్రారంభించినట్లు జేసీ బి.లావణ్యవేణి తెలిపారు. ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ప్రతి రోజు ఉదయం 7గంటలకు బియ్యం, పంచదార ఈ నెల 17 వరకు పంపిణీ చేసేలా ఆదేశించామన్నారు. విటమిన్ ఏ, ఫోలిక్‌యాసిడ్, విటమిన్ బి12 , ఐరన్ కలిపిన పోషకవిలువలతో కూడిన బియ్యాన్ని పంపిణీ చేయనున్నందున కార్డుదారులు ఆ బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలోని కార్డుదారులకు పోషక విలువలతో కూడిన చిక్కి, గోధుమ పిండిని కేజి రూ.16కే ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని కార్డుదారులు ప్రభుత్వం సరఫరా చేసే పోషక విలువలు కలిగిన పోర్టిఫైడ్ బియ్యం, గోధుమ పిండిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీలో ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నెం 1967 కు ఫోన్ చేయవచ్చునని జెసి బి లావణ్యవేణి ఆ ప్రకటనలో తెలిపారు.

సురేంద్రనాథ్ చౌదరికి పితృ వియోగం


కృష్ణారావు (ఫైల్)

టి.నరసాపురం, ఫిబ్రవరి 1 : తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గన్నిన సురేంద్రనాథ్ చౌదరి తండ్రి గన్నిన వీర వెంకట కృష్ణారావు(60) గురువారం మృతి చెందారు. బుధవారం ద్విచక్ర వాహనంపై జంగారెడ్డిగూడెం వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో ఆయన గాయపడ్డారు హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతదేహాన్ని బొరగం శ్రీనివాసులు, జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, రెడ్డి సూర్యచంద్రరావు, ఆచంట సూర్యనారాయణ, నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

శలా కోటి వీరయ్య సంతాప సభ

ఏలూరు కల్చరల్, ఫిబ్రవరి 1: కర్షిభక్తుల సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శలా కోటి వీరయ్య సంతాప సభ గురువారం వీరా జగదీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టి.శివశంకర్, కోటినాదం, కె.లింగేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, బసవ కోటయ్య, ఎస్.ప్రసాద్, ఈ.సత్యనారాయణ, సెలా రాజాబాబు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

గోతుల రహదారి

ప్రధాన రహదారిలో వాహనదారులకు తిప్పలు

అంతర్గత రహదారుల పనులు ప్రారంభం


గోతులతో అధ్వానంగా మారిన ఆర్అండ్‌బి ప్రధాన రహదారి

కుక్కునూరు, ఫిబ్రవరి 1: మండలంలో సుమారు 40 కిలోమీటర్లు మేర ఆర్ అండ్ బి ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా మారింది. రహదారి నిర్మాణానికి రెండేళ్ల క్రితం ప్రభుత్వం రూ.26కోట్లు నిధులు మంజూరు చేసింది. పనులు కూడా ప్రారంభం కావడంతో రహదారి కష్టాలు తీరతాయని ప్రజలంతా ఆశించారు. ఏడు కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనుల అనంతరం బిల్లుల చెల్లింపుల్లో సాంకేతిక సమస్య ఏర్పడింది. దీంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. పలు సార్లు ప్రజలు, ప్రజాప్రతినిధులు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు సమస్య పరిష్కారమైంది. కానీ పెండింగ్ బిల్లు ఇంకా చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్ ఇంకా పనులు చేపట్టడం లేదని స్థానికులు చెబుతున్నారు. తరచుగా ఈ రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు బోల్తా పడుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే ఏ గొయ్యి ఎంత లోతు ఉందో కూడా తెలియని పరిస్థితి ఉంది. 40 కిలోమీటర్ల రహదారిపై ప్రయాణానికి దాదాపు 2 గంటలపైగా సమయం పడుతుంది. ప్రధాన రహదారి పనులు కూడా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామాల్లో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులకు కొంత మోక్షం కలిగింది. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో మండలంలోని పలు గ్రామీణ రహదారులను సీసీ రహదారులుగా నిర్మించడానికి అనుమతులతో పాటు నిధులను మంజూరు చేసింది. కుక్కునూరు, రాజీవ్‌నగర్, అమరవరం, గణపవరం, మాధవరం, పెదరావిగూడెం, మారేడుబాక, సీతారామనగరం, శ్రీధర, తొండిపాక, ఉప్పేరు పంచాయతీల్లో 21 పనులను రూ.1.16 కోట్లు నిధులతో సీసీ రహదారులు నిర్మాణం జరగనుంది. పంచాయతీ శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ పర్యవేక్షణలో పనులు చేపట్టనున్నారు. ఇదే సమయంలో కుక్కునూరు-అశ్వారావుపేట, కుక్కునూరు-భద్రాచలం ఆర్అండ్‌బి రహదారులకు మాత్రం మోక్షం కలగడం లేదు.


సమస్య వివరిస్తున్న గ్రామ ఎస్సీ, ఎస్టీ మహిళలు

కుల గణన సర్వేలో తప్పులు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 1: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కుల గణన సర్వేలో తప్పులు దొర్లుతున్నాయి. పేద మధ్య తరగతి ప్రజలు తమకు సర్కారు సంక్షేమ ఫలాలు అందుతాయే లేదోనని ఆందోళన చెందుతున్నారు. తాటియాకులగూడెం పంచాయతీ ఉదయ్ భాస్కర్ కాలనీలో ఇటీవల కుల గణన సర్వే నిర్వహించారు. కొందరు వలంటీర్లు తమకు కేటాయించిన 50 ఇళ్లకు సంబంధించిన సర్వే సమాచారం పూర్తి చేసి అధికారులకు నివేదిక పంపారు. 50 ఇళ్ల ఆధార్ కార్డుల నకలు, ఇతర వివరాలు ఉండడంతో ఫోన్‌చేసి ఓటీపీ అడిగి సర్వే వేగంగా పూర్తి చేశారు. కాలనీ వాసులు తమ ఇంటి పేర్లు సక్రమంగా నమోదు కాలేదని, కులం తప్పుగా నమోదైనట్లు గురువారం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఓసీగా నమోదైనట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దారు జి.సుందర్‌సింగ్, జూనియర్ అసిస్టెంట్, వీఆర్వోలతో కలసి సమస్య పరిష్కరించే పనిలో పడ్డారు. గ్రామంలో విచారణకు సిద్ధమయ్యారు. ఆన్‌లైన్ పొరపాట్లను సరిచేస్తామని చెప్పారు. గ్రామస్థులు మాత్రం రీ సర్వే చేయ్యాలని కోరారు. గ్రామంలో సుమారు 30 కుటుంబాల వారు ఎస్సీ ఎస్టీ మహిళలు సమస్య పరిష్కరించాలని అధికారులను కోరారు.

రావికంపాడు పంచాయతీ రికార్డుల పరిశీలన

కామవరపుకోట, ఫిబ్రవరి 1: రావికంపాడు పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని గ్రామస్తుడు దొరబాబు ఉన్నతాధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇన్‌చార్జి ఎంపీడీవో జి.మరిడయ్య గురువారం పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఉద్యోగుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేసినట్లు తెలిపారు. సచివాలయ కార్యదర్శి కె.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు. వివరణకు సర్పంచ్ వేముల నాగేశ్వరరావు అందుబాటులో లేరు.

సంక్షిప్త సమాచారం..

- **ఉంగుటూరు :** దొంతవరం గ్రామ శివారులో చేబ్రోలు పోలీసులు పేకాట స్థావరంపై గురువారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.30,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.కిరణ్ కుమార్ తెలిపారు.
- దోమల నివారణకు ప్రజలు సహకరించాలని కైకరం గ్రామ సర్పంచ్ సలగాల గోపి కోరారు. మండలంలోని కైకరం గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం సర్పంచ్ సలగాల గోపి ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది దోమల మందును పిచికారి చేశారు.
- **జీలుగుమిల్లి :** దర్భగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.7వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ చెప్పారు.
- **పెదవేగి :** ఎస్ఐగా వి.రాజేంద్రప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పెదవేగి ఎస్ఐగా పనిచేసిన ఎం.లక్ష్మణ్ సాధారణ బదిలీల్లో భాగంగా ఉండి స్టేషన్ ఎస్ఐగా బదిలీపై వెళ్ళారు.
- **ఏలూరు కార్పొరేషన్ :** నగరంలో షిరిడీ సాయి మందిరాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకున్నారు. ఆదివారపుపేట సాయి ప్రేమమందిర్ వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు.
- **కామవరపుకోట :** తేలీల వీధి షిరిడీ సాయి మందిర్ వద్ద, చౌతనా సెంటర్‌లో షిరిడీ సాయి మందిరం వద్ద అన్న సమారాధన చేశారు.



కొల్లేరులో సేద తీరుతున్న విదేశీ వలస పక్షులు

ప్రమాదంలో చిత్తడి నేలలు

సంరక్షించుకోకపోతే పర్యావరణానికి ముప్పు

అటపాకలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏటా వేడుకలు

నేడు ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం

కైకలూరు, ఫిబ్రవరి 1: పర్యావరణాన్ని పరిరక్షించుకోకపోతే భావితరాలకు చిత్తడి నేలలు ఉండవు. ఇప్పటికే పలురకాల పక్షులు, జంతువులు, జీవ జాతులు అంతరించిపోతున్నాయి. కొన్నిరకాల జంతువులు, పక్షులు చూడాలంటే జూపార్కులోనో, ఛానల్స్‌లోనే చూడవలసి వస్తుందని, ఇదే పరిస్థితి కొన సాగితే భవిష్యత్తులో చిత్తడినేలలు కనుమరుగవుతాయని పర్యావరణ నిపు ణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానవాళి మనుగడకు చిత్తడి నేలలు ఎంతో దోహదపడతాయి. సృష్టిలో సహజసిద్ధంగా ఏర్పడిన వనరులను కాపాడుకుంటే భావితరాల ప్రజలకు వాటి ఆవశ్యకత, స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించగలుగుతాం. సృష్టిలో ఉన్న అనంతకోటి జీవరాశుల్లో 40 శాతం చిత్తడి నేలల్లోనే ఉంటాయి. పక్షులకు ఈ నెలల్లో ఆహారం సమృద్ధిగా లభిస్తుంది. వీటి ప్రాముఖ్యతను గుర్తించి వివిధ దేశాలు చిత్తడి నేలల దినోత్సవం నిర్వహిస్తున్నాయి.



చిత్తడి నేలల పరిధిలోకి కొల్లేరు

చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించి ఇరాన్ దేశంలోని రామ్‌సార్ గ్రామంలో 1971లో జరిగిన సదస్సులో ప్రపంచంలోని అన్ని దేశాలు పాల్గొన్నాయి. ఈ సదస్సులో చిత్తడి నేలల ఆవశ్యకతను గుర్తించారు. ప్రపంచంలో ఏ దేశంలో ఉన్నా వాటిని పరిరక్షించాలని ఆయా దేశాల ప్రతినిధులు తెలి యజేశారు. అదే రోజును పురస్కరించుకొని ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవంగా గుర్తించి రామ్‌సర్ సైట్ అని నామకరణం చేశారు. ప్రపంచంలో పలు దేశాల్లోని చిత్తడినేలలుగా పేరొందిన వాటిని ఈ సైట్‌లోకి తీసుకున్నారు. చిత్తడి నేలల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయా దేశాలకు వివరించారు. కొల్లేరు 2002లో రామ్‌సర్ సైట్‌లోకి తీసుకున్నారు. 2006లో కొల్లేరును అటవీశాఖ అధికారులకు అప్పగించారు. 2009 నుంచి అటపాక వలస పక్షుల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం నిర్వహి స్తున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. వారికి కొల్లేరు, చిత్తడి నేలల ఆవశ్యకతపై పలు పోటీలను నిర్వహిస్తారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందిస్తారు.

ప్రాధాన్యంపై ప్రచారం శూన్యం

ప్రతి సంవత్సరం అటవీశాఖ ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నప్పటికీ ప్రజల్లో ఈ నేలల విశిష్టతను తెలిపే విధంగా ఎక్కడా కొల్లేరు పరి వాహక ప్రాంతంలో ఏ విధమైన ప్రచారాలు లేవు. గతంలో డబ్ల్యుడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో కొన్ని కార్యక్రమాలు నిర్వహించేవారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈ కార్యక్రమాలు డబ్ల్యుడబ్ల్యుఎఫ్ బృందం పాల్గొనడం మానేసింది. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అటవీశాఖ అధికారులు కొల్లేరు కాలువలో తాటిదోనెల పోటీలను రెండు సంవత్సరాల పాటు నిర్వహించారు. పక్షుల పండుగను జరిపి ప్రజలను తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడా చేపట్టిన దాఖలాలు లేవు. ఈ నేలల అభివృద్ధికి ఒక్క రూపాయి ఖర్చు చేసిందీ లేదు. చిత్తడి నేలల విశిష్టతను అందరికీ తెలిసే విధంగా మరింత ప్రచారం చేస్తే వాటి విలువ తెలుస్తుందని పర్యావరణవేత్తలు పేర్కొంటున్నారు.



కొల్లేరు వ్యూ

సముద్రం, నది ఇతర నీటి వనరులు కలిగిన తీరప్రాంతాల్లో తక్కువ లోతు ఉండి ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండే భూములను చిత్తడి నేలలు అంటారు. పెద్దనదులు లేదా సరస్సుల వెంబడి మంచినీటి చిత్తడి నేలలు ఏర్పడతాయి.. అతిపెద్ద సరస్సుగా ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సును చిత్తడి నేలలు కలిగిన భూమిగా గుర్తించారు.

సీఎం పర్యటన.. వాహనాల మళ్లింపు



మాట్లాడుతున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 1 : ఏలూరులో 3న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ దృష్ట్యా ఆరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు జిల్లా మీదుగా వెళ్లే భారీ వాహనాలను దారి మళ్లి స్తు న్నట్లు ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు తెలిపారు.

విశాఖపట్టణం వైపు నుంచి విజయ వాడ, చెన్నై వైపు వెళ్ళే భారీ వాహనాలను కత్తిపూడి జంక్షన్ వద్ద మళ్లించి గొల్లప్రోలు, కాకినాడ, అమలాపురం, చించినాడ బ్రిడ్జి, నర్సాపురం, మొగల్తూరు మీదుగా మళ్లించారు. పెరవలి, సిద్ధాంతం వద్ద దారి మళ్ళించిన వాహనాలు పెనుగొండ, పాలకొల్లు, నర్సాపురం, మొగల్తూరు మీదుగా తాడేపల్లిగూడెం, తణుకు వద్ద దారి మళ్ళించిన వాహనాలు భీమవరం, నర్సాపురం, మొగల్తూరు, లోసరి వంతెన మీదుగా చెన్నై వైపు వెళ్ళాలన్నారు.

విశాఖపట్టణం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు దేవరపల్లి వద్ద దారి మళ్లించనున్నట్టు తెలిపారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం సూర్యాపేట మీదుగా వెళ్లాలన్నారు. తాడేపల్లిగూడెం వద్ద దారి మళ్ళించిన వాహనాలను నల్లజర్ల, కొయ్య లగూడెం, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మీదుగా, నారాయణపురం వద్ద దారి మళ్లించిన వాహనాలు దూబచర్ల, భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మీదుగా వెళతాయన్నారు. హనుమాన్ జంక్షన్ నుంచి నూజివీడు, రామన్నపేట అడ్డరోడ్డు, ధర్మాజీగూడెం, చింతలపూడి, జీలుగుమిల్లి, జంగా రెడ్డిగూడెం మీదుగా వెళ్ళాలన్నారు.

విజయవాడ నుంచి రాజమండ్రి వైపు వెళ్ళే చిన్న వాహనాలు సోమవరప్పాడు (జంగారెడ్డిగూడెం రోడ్డువైపు నుంచి) జోగన్నపాలెం, సీతమంపేట రైల్వే గేటు, తిరుమల డైరీ మీదుగా జాతీయ రహదారిలోకి వెళ్ళాలన్నారు. రాజ మండ్రి వైపు నుంచి విజయవాడ వైపు వెళ్ళు కార్లు, ఇతర చిన్న వాహనాలు కొవ్వలి బ్రిడ్జి నుంచి కొవ్వలి, పాలగూడెం మీదుగా మినీ బైపాస్ రోడ్డు, వట్లూరు, కలపర్రు వద్ద జాతీయ రహదారిలోకి వెళ్లాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఏలూరు జాతీయ రహ దారిపై, ఆశ్రం ఆసుపత్రి వైపు కాని వాహనాలు రాకూడదని సూచించారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మళ్లీ త్రిసభ్య కమిటీలకే పీఏసీఎస్‌ల పాలన?

ముదినేపల్లి, ఫిబ్రవరి 1 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు తిరిగి నామినేటెడ్ త్రిసభ్య కమిటీల ఏలుబడిలోనే కొనసాగనున్నాయి. సంఘాలకు ఆరు నెలల క్రితం సహకార శాఖ అధికారులు నామినేట్ చేసిన త్రిసభ్య కమిటీలే యథాతథంగా కొనసాగనున్నాయి. గత నెల 30తో కమిటీల పదవీ కాలం ముగియటంతో ఆ కమిటీలను మరో ఆరు నెలలపాటు కొనసాగించేందుకు అధికారులు తాజాగా ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ముదినేపల్లి మండలంలోని 15 పీఏసీఎస్‌లకు పాత త్రిసభ్య కమిటీలే కొనసాగనున్నట్టు తెలిసింది. 2017 నుంచి సహకార సంఘాలు నామినేటెడ్ కమిటీల పాలనలోనే ఉన్నాయి. ఆరేళ్లుగా సహకార సంఘాలకు ప్రతి ఆరు నెలలకొకసారి కమిటీలను నామినేట్ చేయటం సహకార రంగ చరిత్రలో రికార్డు అని చెప్పవచ్చు. ఎన్నికలు సమీపిస్తున్నందున పాత కమిటీల్లో మార్పులను చేపట్టలేదు. పీఏసీఎస్‌ల నుంచి పాత కమిటీల వివరాలే జిల్లా సహకార శాఖాధికారికి యథాతథంగా పంపడంతో వాటికి ఆయన ఆమోదముద్ర వేసే అవకాశాలున్నాయి.

విశ్వబ్రాహ్మణ సంఘం 27వ వార్షికోత్సవం

కైకలూరు, ఫిబ్రవరి 1: నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘానికి చెందిన ఆర్ఎంపీ డాక్టర్లు, సిద్ధాంతులను ఘనంగా సన్మానించారు. గురువారం కైకలూరు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణుల సంఘం 27వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సిద్ధాంతులు, ఆర్ఎంపీ వైద్యులను సన్మానించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు తుపాకుల సోమాచారి, డీఎంఎస్ నాయకులు యానల బసవయ్య, గుడివాడ, మోగల్లూరు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు గానుగుల రాజు, సీహెచ్ పాండురంగారావు పాల్గొన్నారు.

కొండ చిలువ హతం



ముదినేపల్లి, ఫిబ్రవరి 1 : ముదినేపల్లి మండలం చిగురుకోట శివారు మీగడాపురం గ్రామం వద్ద వడాలి-తాడినాడ ప్రధాన రహదారిపైకి గురువారం రాత్రి ఒక కొండచిలువ సంచరించింది. పరిసర ప్రాంతాల నుంచి ఈ కొండ చిలువ రోడ్డుపైకి రావడంతో చుట్టుపక్కల ప్రజలు ఆందోళనతో పరుగులెత్తారు. అక్కడికి సమీపంలో ఉన్న ఇద్దరు వ్యక్తులు వచ్చి కర్రలతో కొట్టి దానిని హతమార్చారు.

సారా విక్రేతకు రిమాండ్

ముసునూరు, ఫిబ్రవరి 1: సారా విక్రయిస్తున్న వ్యక్తిని ముసునూరు పోలీసులు బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. చెక్కపల్లికి చెందిన అనగాని శ్రీనివాసరావు తన ఇంటివద్ద సారాను విక్రయిస్తున్న నేపథ్యంలో ఎస్సై వాసు తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని అతని నుంచి మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి గురువారం నూజివీడు కోర్టులో హాజరుపర్చగా జడ్జి అతనికి రిమాండ్ విధించినట్టు ఎస్సై తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, ఫిబ్రవరి 1: రమణక్కపేట గ్రామ శివారులో గురువారం పేకాట శిబిరంపై ఎస్సై వాసు తన సిబ్బందితో దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1135లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ముద్దరబోయినకే టీడీపీ టిక్కెట్ ఇవ్వాలి

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 1: నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయినకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పార్టీ ఆగిరిపల్లి మండలాధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో జరిగిన సమావేశంలో ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు కొండా మంగయ్య మాట్లాడుతూ ముద్దరబోయినపై జరుగుతున్న విషప్రచారాన్ని తిప్పి కొట్టడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశామని, రెండుసార్లు ఓడిపోయినా పార్టీని వీడక ప్రజలకు సేవ చేస్తున్నారని, అదిష్ఠానం ఆయనకే నూజివీడు టిక్కెట్ కేటాయించాలని కోరారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కైకలూరు కాంగ్రెస్ టిక్కెట్ కోసం దరఖాస్తులు



దరఖాస్తు ఇస్తున్న మంగినేని

ముదినేపల్లి, ఫిబ్రవరి 1 : రానున్న సాధారణ ఎన్నికల్లో కైకలూరు శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని పీసీసీ సభ్యుడు, ముదినేపల్లి మండలానికి చెందిన మంగినేని నాగ వెంకట రామాంజనేయ గాంధీ (బాబ్జీ) కోరారు. ఈ మేరకు గురువారం విజయవాడ గాంధీ భవన్‌లో అర్జీల స్వీకరణ కమిటీ ప్రతినిధికి బాబ్జీ దరఖాస్తు అందజేశారు. 1999 నుంచి తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా క్రియాశీలకంగా రాజకీయాల్లో ఉన్నానని, టిక్కెట్ తనకే కేటాయించాలని కోరారు.



దరఖాస్తు ఇస్తున్న కట్టా నాగరాజ్‌గౌడ్

కైకలూరు: కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు గురువారం విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ సిబ్బందికి దరఖాస్తు అందజేసినట్లు కట్టా నాగరాజు గౌడ్ తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేశానని ప్రస్తుతం కైకలూరు మండలం ఆచవరం సర్పంచ్‌గా కొనసాగుతున్నానని రాష్ట్ర విభజనానంతరం కూడా కాంగ్రెస్‌ను వీడకుండా ప్రజలకు అనేక సేవలందించానని అందువల్ల తనకు టిక్కెట్ కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

సీపీఎం విరాళాల సేకరణ



కలిదిండి, ఫిబ్రవరి 1 : ప్రజా ఉద్యమాలను కమ్యూనిస్టు పార్టీ నాయకులు బలోపేతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డీఎన్వీ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కలిదిండిలో సీపీఎం నాయకులతో కలసి పార్టీ ఫండ్ కింద ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న సీపీఎం పార్టీకి ప్రజలు విరాళాలు అందించి సహకరించాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు భాస్కర్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోరుకొల్లులో స్వచ్ఛభారత్



కలిదిండి, ఫిబ్రవరి 1 : కోరుకొల్లులో సర్పంచ్ బట్టు లీలా కనకదుర్గ ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛ భారత్ నిర్వహించారు. గ్రామంలో పేరుకుపోయిన చెత్తా చెదారం తొలగించి వీధులను శుభ్రపర్చారు. పిచ్చి మొక్కలను తొలగించారు. డ్రైనేజీ వెంబడి బ్లీచింగ్ చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి వార్డులో స్వచ్ఛ భారత్ నిర్వహిస్తామన్నారు. వార్డు సభ్యులు నున్న సుబ్రహ్మణ్యం, మామిడిశెట్టి రాము, నూకల అరుణకుమారి, తులసి, గొరిపర్తి ఏసుబాబు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల తనిఖీ.. కేసుల నమోదు



నూజివీడు, ఫిబ్రవరి 1: నూజివీడు పట్టణంలో మూడు రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. నూజివీడు పట్టణంలోని 1, 3, 8 నంబర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా, ఐదు టన్నుల బియ్యం తక్కువగా ఉండటంతో సదరు షాపులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు విజిలెన్స్ ఎస్సై సీహెచ్ రంజిత్ కుమార్ తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ పి.శివరామకృష్ణ, తహసీల్దార్ వి.కన్యాకుమారి, ఆర్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాదుల నిరసన ప్రదర్శన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 1: ల్యాండ్ టైటిల్ యాక్ట్ 2022ను రద్దు చేయాలని కోరుతూ నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు హాలు వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల ఆస్తుల భద్రతకు భంగం కలిగించేలా ఉన్న ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 2022ను తక్షణం రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇందుపల్లి సత్యప్రకాష్ డిమాండ్ చేశారు. అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ముదినేపల్లి, ఫిబ్రవరి 1 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతికత, మానవీయ విలువలు, పర్యావరణ విద్య సబ్జెక్టులపై శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 2న మానవీయ విలువలు, పర్యావరణ విద్యపై పరీక్షలు జరుగుతాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఆ కళాశాలకు చెందిన 26 మంది ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జాస్మిన్ తెలిపారు. విద్యార్థులు పరీక్షలు ప్రారంభ సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. ముదినేపల్లి వికాస్ కళాశాలలో 78 మంది, వీఆర్ జూనియర్ కళాశాలలో 17 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు.

వృత్తి నైపుణ్య కోర్సులపై అవగాహన

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 1: నూజివీడు బాలికోన్నత పాఠశాల పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఒకేషనల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా మంగళవారం నూజివీడు గార్మెంట్స్ సందర్శించారు. ఒకేషనల్ కోర్సులు అభ్యసించటం ద్వారా భవిష్యత్తులో విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై గార్మెంట్స్ యాజమాన్యం అవగాహన కల్పించింది. ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ వీవీఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ ఒకేషనల్, టెక్నికల్ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు, ఉపాధి త్వరగా లభిస్తాయన్నారు. వృత్తివిద్యా ఉపాధ్యాయులు అనూరాధ శ్రీనివాస్, లావణ్య మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



తక్కెళ్లపాడులో పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు

కైకలూరు/ కలిదిండి/ మండవల్లి, ఫిబ్రవరి 1: గ్రామాల్లో అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. గురువారం కైకలూరు వారపు సంత నుంచి శ్యామలాంబ అమ్మవారి ఆలయం వరకు సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే కైకలూరు 2వ సచివాలయం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ డీఎం నవరత్నకుమారి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కలిదిండి మండలం గోపాలపురం, వెంకటాపురంలో నిర్మించిన సీసీ రహదారులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీదేవి, గోపాలపురం సర్పంచ్ అనపర్తి వడ్డి కాసులు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం తక్కెళ్లపాడులో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలను కైకలూరు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, పార్టీ మండల అధ్యక్షులు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొరాయి గతి ఇంతేనా..?

- డంపింగ్ యార్డులా మారిన వైనం
- అక్కడే మూత్ర విసర్జనలు
- పట్టించుకోని ఆలయ అధికారులు
- భక్తుల ఆవేదన

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 1: ఆగిరిపల్లి నడిబొడ్డున ఉన్న పెద్దకొరాయి (కల్యాణ మంటపం) చెత్తాచెదారంతో నిండి డంపింగ్ యార్డులా మారింది. మెయిన్ సెంటర్లో ఉన్న పెద్దకొరాయి ఇలా మారటం శోభనాచల స్వామివారి భక్తులకు బాధ కలిగిస్తోంది. రథసప్తమినాడు స్వామివారి కల్యాణం సైతం ఇక్కడే జరుగుతుంది. ఏటా జరిగే తిరునాళ్ళలో మాత్రమే శుభ్రంగా ఉంటుంది. పెద్ద కొరాయి పక్కన ఉన్న గోడపై నిత్యం పలువురు పాదచారులు మూత్రవిసర్జన చేస్తున్నారు. ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న పెద్దకొరాయికి మరమ్మతులు చేయించాలంటే నిధుల కొరత అంటున్నారు. ఆలయానికి చెందిన దుకాణాలకు వేలాది రూపాయలు అద్దెలు వస్తున్నా కొరాయికి రూ.10 వేలు కూడా ఖర్చుపెట్టి ప్లాస్టింగ్ పనులు చేయించలేకపోవడం ఎండోమెంట్ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. అధికారులు ఇలాంటి చిన్నచిన్న విషయాలు కూడా దాతల సహకారం గురించి ఆలోచించటం భక్తులకు ఆగ్రహం తెప్పిస్తోంది. పాడైన గోడల వైపు నిత్యం



పాదచారులు మూత్ర విసర్జన చేస్తున్నా, పెద్దకొరాయిని డంపింగ్ యార్డులా మార్చి చెత్తవేస్తున్నా ఆలయ ఈవో పట్టించుకోవడం లేదు.

బదిలీలు.. చేరికలు

నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్ గౌడ్ బదిలీ

నూజివీడు, ఫిబ్రవరి 1: నూజివీడు డీఎస్పీ ఇ.అశోక్‌కుమార్‌గౌడ్ బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన విజయవాడ ట్రాఫిక్ విభాగానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో విశాఖపట్నం మెరైన్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావును నూజివీడుకు బదిలీ చేశారు.

నూజివీడు ఎంపీడీవోగా కిరణ్‌కుమార్



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 1: నూజివీడు ఎంపీడీవోగా కె.కిరణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నూజివీడు ఎంపీడీవోగా ఇక్కడ పనిచేస్తున్న వీఏ విజయ్‌కుమార్ పల్నాడు జిల్లా గొల్లపల్లికి బదిలీ కాగా ఆయన స్థానంలో తణుకు ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.కిరణ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

చాట్రాయి ఎంపీడీవోగా మంగా కుమారి



చాట్రాయి, ఫిబ్రవరి 1: చాట్రాయి ఎంపీడీవోగా బీఎస్ఎల్ మంగా కుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. టి. నరసాపురం నుంచి ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ గుంటూరు జిల్లా పత్తిపాడు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని చెప్పారు.

ముదినేపల్లి ఎంపీడీవోగా గంగాధరరావు



ముదినేపల్లి, ఫిబ్రవరి 1 : ముదినేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎస్.ఎం.గంగాధరరావు నియమితులయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు నుంచి బదిలీపై వచ్చిన ఆయన గురువారం ముదినేపల్లి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, మండల పరిషత్ కార్యాలయ ఏవో రమణబాబు తదితరులు నూతన ఎంపీడీవోను అభినందించారు.

ముసునూరు మండలంలో..



ఎంపీడీవో పద్మావతి దేవి

ముసునూరు, ఫిబ్రవరి 1: ముసునూరు నూతన ఎంపీడీవోగా సీహెచ్ పద్మావతీ దేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా భీమడోలు మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న పద్మావతి దేవి ముసునూరు బదిలీ కాగా ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.రాణి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే నూతన ఈవోపీఆర్డీగా ఎస్వీ శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టగా ఇక్కడ పనిచేస్తున్న బీఏ సత్య నారాయణ కాకినాడ జిల్లా కరప ఈవోపీఆర్డీగా బదిలీ అయ్యారు. అలాగే ముసునూరు మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న దాసరి సుధ రాజమహేంద్రవరం తహసీల్దార్‌గా బదిలీ చేసినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

న్యాయసేవల సదస్సు వాయిదా

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 1: నూతన తరహా న్యాయసేవలకు సంబంధించి ఈ నెల 3న నిర్వహించనున్న సదస్సును వాయిదా వేసినట్టు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా న్యాయాధికారి ఎ. నాగశైలజ తెలిపారు. శనివారం నూజివీడు రోటరీ కల్యాణ మండపంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మచిలీపట్నం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన నూతన తరహా న్యాయసేవల శిబిరాన్ని వాయిదా వేయాల్సిందిగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశించిన నేపథ్యంలో సదస్సును వాయిదా వేసినట్టు, ఎప్పుడు నిర్వహించేది తరువాత తెలియజేస్తామన్నారు.

బలివే ఉత్సవాల్లో దుకాణాల ఏర్పాటుకు వేలం

ముసునూరు, ఫిబ్రవరి 1: బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాల్లో తాత్కాలిక దుకాణాల ఏర్పాటు హక్కుల కోసం గురువారం దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. బలివే ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ గన్నవరం ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్, ధర్మకర్తల మండలి చైర్మన్ నాగుల నాగేశ్వరరావు సమక్షంలో జరిగిన ఈ వేలంలో ఆలయ ఖాళీస్థలంలో మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు మూడురోజుల పాటు దుకాణాల ఏర్పాటు హక్కును బలివే గ్రామానికి చెందిన పిల్లిరెడ్డియ్య రూ.13 లక్షలకు దక్కించుకున్నట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. గత ఏడాదికంటే రూ.2.50 లక్షలు అధిక ఆదాయం లభించిందన్నారు. ఉత్సవాల్లో కొబ్బరి చెక్కలు పోగుచేసుకునే హక్కుకు నిర్దేశిత ధరావతును ఎవరూ చెల్లించకపోవడంతో వేలంను వాయిదావేసినట్లు ఈవో తెలిపారు. సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ధర్మకర్తలి మండలి సభ్యులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడిగా వెంకట్రావు



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 1: నూజివీడు భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా నూజివీడు పట్టణానికి చెందిన తోట వెంకట్రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యవర్గ ఎన్నికను గురువారం నూజివీడులో నిర్వహించారు. ఉపాధ్యక్షుడిగా వాకా రాంబాబు ఎన్నిక కాగా నిర్మాణ కార్మికుల అండగా నిలబడతానని నూతన అధ్యక్షుడు వెంకట్రావు తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు



ముసునూరు, ఫిబ్రవరి 1: ముసునూరు ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటికలో ఎంపీటీసీ నిధులతో మంచినీటి బోరు ఏర్పాటుకు గురువారం పనులు ప్రారంభించారు. ఎంపీటీసీ -1 చీలి లక్ష్మికి కేటాయించిన రూ.3 లక్షల నిధులతో శ్మశాన వాటికలో బోరు నిర్మాణంతో పాటు చేతిపంపు ఏర్పాటు చేస్తున్నారు. తులిమెల్లి రంగారావు, చీలి అర్లప్ప, భాగ్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితుడికి పింఛన్ అందజేత



చాట్రాయి, జనవరి 1: చాట్రాయికి చెందిన డయాలసిస్ పేషెంట్ అంబటి చెన్నారావుకు మంజూరైన నెలకు రూ. 10 వేలు పింఛన్‌ను గురువారం గ్రామ ప్రముఖుడు దామెర ప్రసాద్ బాబు లబ్ధిదారుడికి అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, స్థానిక నాయకులు సత్యనారాయణ, శ్రీను, రామారావు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన ఉండాలి : ఎంవీఐ



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 1:విద్యతో పాటు రహదారి భద్రత నియమాలను తెలుసుకోవడం ప్రతి విద్యార్థికి ముఖ్యమని, నూజివీడు ఎంవీఐ జి.నాగమురళి అన్నారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం నూజివీడు సెయింట్ థామస్ పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులు ఎక్కి, దిగేటప్పుడు క్యూపద్ధతి పాటించటం వల్ల ప్రమాదాలు జరగకుండా చూసుకోవచ్చన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి, ఆర్టీసీ డీఎం పవన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.